తెలుగు దినపత్రిక
https://aksharagalam.com

# అక్షరగళం

ప్రతి అక్షరం ప్రజల కోసం

పేజీలు: 8 | వెల: 3 | సంపుటి:3 | సంచిక: 137



సచివాలయంలో "తెలంగాణ స్టేట్ పోలీస్ కంప్లైంట్స్ అథారిటీ (SPCA)"వెబ్ సైట్, లోగోను ఆవిష్కరించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి. హాజరైన మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, డీజీపీ శివధర్ రెడ్డి, హెూం శాఖ స్పెషల్ సీఎస్ సీవీ ఆనంద్, CGG DG రవి గుప్త, ఇంటలిజెన్స్ ADG విజయ్ కుమార్, SPCA చైర్మన్ రిటైర్డ్ జస్టిస్ శివ శంకర్ రావు, సభ్యులు, ఉన్నతాధికారులు.

శుక్రవారం అక్టోబర్ 17, 2025

॥ ఎడిటర్: దయాకర్ రెడ్డి ॥

## బిసి రిజర్వేషన్లపై ప్రభుత్వానికి

# దక్కని ఊరట

- స్పెషల్ లీవ్ పిటిషన్‌పై విచారణకు సుప్రీం తిరస్కరణ
- పాత పద్ధతిలోనే ఎన్నికలకు వెళ్లాలని సూచన
- హైకోర్టు విచారణపై జోక్యం చేసుకోలేమన్న ధర్మాసనం
- 50శాతం మించి రిజర్వేషన్లను ఆమోదించలేమని వ్యాఖ్య
- ప్రభుత్వం తదుపరి కార్యాచరణపై ఉత్కంఠ







**న్యూఢిల్లీ,అక్టోబర్16(అక్షరగళం):** సుప్రీంకోర్టులో తెలంగాణ ప్రభుత్వానికి చుక్కెదురైంది. బీసీ రిజర్వేషన్లపై రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన స్పెషల్ లీవ్ పిటిషన్ ఎస్ఎల్‌పీని సర్వోన్నత న్యాయస్థానం కొట్టేసింది. 50 శాతం రిజర్వేషన్లతోనే ఎన్నికలకు వెళ్లండని ప్రభుత్వానికి సుప్రీంకోర్టు సూచించింది. పాత రిజర్వేషన్లతో ఎన్నికలకు వెళ్లాలని సర్వోన్నత న్యాయస్థానం ఆదేశించింది. సుప్రీంకోర్టు ఆదేశాలతో సంబంధం లేకుండా తదుపరి విచారణ చేపట్టాలని ధర్మాసనం హైకోర్టుకు సూచించింది. స్థానిక ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల అంశంపై తెలంగాణ ప్రభుత్వం దాఖలు చేసిన స్పెషల్ లీవ్ పిటిషన్‌ను విచారణకు సుప్రీంకోర్టు నిరాకరించింది. ఈ అంశం హైకోర్టులో పెండింగ్‌లో ఉన్నందున విచారణకు స్వీకరించలేమని అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. తమ ఆదేశాలతో సంబంధం లేకుండా తదుపరి విచారణ చేపట్టాలని.. మెరిట్స్ ప్రకారం విచారించాలని హైకోర్టుకు సూచించింది. కావాలనుకుంటే పాత రిజర్వేషన్ల ఆధారంగా స్థానిక ఎన్నికలకు వెళ్లవచ్చని పేర్కొంది. స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ జారీ చేసిన జీఓ 9పై హైకోర్టు విధించిన స్టేను సవాల్ చేస్తూ తెలంగాణ ప్రభుత్వం సుప్రీంకోర్టులో ఎస్ఎల్‌పీ దాఖలు చేసిన విషయం తెలిసిందే. హైకోర్టు ఈ నెల 9న జారీచేసిన మధ్యంతర ఉత్తర్వులను సవాల్‌చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం 13వ తేదీన పిటిషన్ దాఖలుచేసింది. అత్యవసర పరిస్థితుల దృష్ట్యా 16, 17వ తేదీల్లో ఏదో ఒకరోజు ఈ అంశంపై విచారించాలని మంగళవారం సుప్రీంకోర్టు రిజిస్ట్రార్ ముందు మెన్షన్ చేసింది. రాష్ట్ర ప్రభుత్వం కోరినట్లుగానే రిజిస్ట్రీ ఈ కేసును గురువారం విచారణ జాబితాలో చేర్చింది. అయితే సుప్రీంకోర్టు దీనిపై విచారణకు నిరాకరించింది. ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతాతో కూడిన ధర్మాసనం గురువారం విచారణ జరిపింది. రాష్ట్ర ప్రభుత్వం తరపున అభిషేక్ సింఘ్వీ వాదనలు వినిపించారు. రిజర్వేషన్లు 50 శాతం మించొద్దనే అభిప్రాయం సరికాదన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలో కులగణన సర్వే జరిగిందని, ప్రభుత్వం ఇంటింటి సర్వే చేసి లెక్క తేల్చిందని సర్వోన్నత న్యాయస్థానంకు వివరించారు. రిజర్వేషన్ల పెంపుపై అసెంబ్లీలో అన్ని పార్టీలు ఏకాభిప్రాయం వ్యక్తం చేశాయని, 3 నెలలు దాటినా బిల్లుపై గవర్నర్ నిర్ణయం తీసుకోలేదని అభిషేక్ సింఘ్వీ వాదించారు. రిజర్వేషన్లు 50 శాతం మించొద్దన్న తీర్పులు స్పష్టంగా ఉన్నాయని, కృష్ణమూర్తి జడ్జిమెంట్ ఈ విషయాన్ని స్పష్టంగా చెప్పిందని ప్రతివాది లాయర్ వాదనలు బలంగా వినిపించారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన స్పెషల్ లీవ్ పిటిషన్‌ను సుప్రీంకోర్టు తిరస్కరించింది. హైకోర్టులో పెండింగ్‌లో ఉండటంతో విచారణకు స్వీకరించలేమని స్పష్టం చేసింది. కావాలనుకుంటే పాత రిజర్వేషన్ల ఆధారంగా స్థానిక ఎన్నికలకు వెళ్లవచ్చని పేర్కొంది. సుప్రీంకోర్టు నిర్ణయంతో రాష్ట్ర ప్రభుత్వం తదుపరి తీసుకునే చర్యలపై అందరిలో ఉత్కంఠ నెలకొంది. కేబినెట్ భేటీలో ఈ అంశంపై చర్చించే అవకాశాలు ఉన్నాయి.



## శ్రీశైలంలో స్వామి అమ్మవార్లను దర్శించుకున్న మోడీ

- ప్రత్యేక పూజల్లో పాల్గొన్న స్వామికి రుద్రాభిషేకం
- పూర్ణకుంభంతో స్వాగతించి..ఆశీర్వించిన పండితులు

**శ్రీశైలం,అక్టోబర్16(అక్షరగళం):** కర్నూలు పర్యటనకు వచ్చిన ప్రధాని నరేంద్ర మోదీ శ్రీశైలం క్షేత్రాన్ని దర్శించుకున్నారు. అర్చకులు, ఆలయ అధికారులు ఆయ నకు వేదోక్తంగా స్వాగతం పలికారు. మిగతా.. 2లో



## వ్యూస్, లైక్స్‌తో సోషల్ మీడియాలో ఫేమస్

వ్యూస్ మాయలో విలువలు మరిచిపోతే ఎలా ?

చిన్నారుల భవిష్యత్‌ను పణంగా పెట్టడం సమంజసమా

చిన్నారులతో అసభ్యకరమైన కంటెంట్ ఉంటే నేరం

ఇలాంటి వాటిని తొలగించండి..భవిష్యత్‌లో పెట్టకండి

లేదంటే చట్టప్రకారం చర్యలు తప్పవని సిపి సజ్జన్నార్ హెచ్చరిక

**హైదరాబాద్,అక్టోబర్16(అక్షరగళం):** వ్యూస్ మాయలో పడి విలువలు మరిచిపోతే ఎలా అని హైదరా బాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ యూ ట్యూబర్లను ప్రశ్నిం చారు. వ్యూస్, లైక్స్‌తో సోషల్ మీడియాలో ఫేమస్ అయ్యేందుకు చిన్నారుల భవిష్యత్‌ను పణంగా పెట్టడం ఎంతవరకు సమంజసమని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. మైనర్లతో కొన్ని యూట్యూబ్ ఛానళ్లు చేస్తున్న ఇంటర్వ్యూలను ఉద్దేశిస్తూ ఎక్స్‌లో సజ్జనార్ పోస్ట్ పెట్టారు. చిన్నారులతో మిగతా.. 2లో

## బిసి రిజర్వేషన్లపై

# వెనక్కి తగ్గేది లేదు

- న్యాయనిపుణులతో చర్చించి ముందుకు
- స్థానిక ఎన్నికల్లో ముగ్గురు పిల్లల నిబంధన ఎత్తివేత
- కొత్తగా మూడు వ్యవసాయ కళాశాలు మంజూరు
- మెట్రో రెండో దశపై సిఎస్ ఆధ్వర్యంలో కేబినేట్ సబ్‌కమిటీ
- డిసెంబరు 1 నుంచి 9 వరకు ప్రజాపాలన విజయోత్సవాలు
- తెలంగాణ కేబినేట్ భేటీలో కీలక నిర్ణయాలు...
- హాజరు కాని కొండా సురేఖ



**హైదరాబాద్,అక్టోబర్16(అక్షరగళం):** బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల పెంపుపై సుప్రీంకోర్టులో వేసిన స్పెషల్ లీవ్ పిటిషన్ డిస్మిస్ కావడంతో తదుపరి కార్యాచరణపై కేబినెట్‌లో చర్చించారు. ఈ కేసును వాదించిన సీనియర్ న్యాయ వాదులు, న్యాయ నిపుణుల సలహాలు సూచనల మేరకు తదుపరి కార్యాచరణ చేపట్టాలని కేబినెట్ నిర్ణయం తీసుకుంది. రెండు రోజుల్లో న్యాయ నిపుణుల అభిప్రాయాలతో మిగతా.. 2లో

## 21వ శతాబ్దం నరేంద్ర మోదీదే..

- మోదీ విజయం భారత్ విజయం... అదే మన విజయం
- కేంద్ర సహకారంతో రాష్ట్రానికి అత్యధిక పెట్టుబడులు
- జీఎస్టీ 2.0తో ప్రజలకు పొదుపూ-భరోసా
- త్వరలో రాయలసీమకు హైకోర్టు బెంచ్
- సూపర్ జీఎస్టీ- సూపర్ సేవింగ్స్ బహిరంగ



సభలో సీఎం చంద్రబాబు

- బీహార్‌లో ఎన్డీఏ విజయం సాధిస్తుందని విశ్వాసం వ్యక్తం చేసిన సీఎం
- ప్రధాని మోదీతో కలిసి శ్రీశైల మహాక్షేత్రాన్ని దర్శించుకున్న ముఖ్యమంత్రి
- రూ.13,429 కోట్ల విలువైన ప్రాజెక్టులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేసిన ప్రధాని మోదీ


5లో

## మావోయిస్టులకు వరుస ఎదురుదెబ్బలు

- ఛత్తీస్‌ఘడ్‌లో లొంగిన 170మంది మావోలు
- లొంగిపోయిన వారిలో వాసుదేవరావు తదితరులు
- ఎక్స్ వేదికగా వెల్లడించిన హోంమంత్రి అమిత్ షా



**న్యూఢిల్లీ,అక్టోబర్16(అక్షరగళం):** మావోయిస్టులకు వరుసగా భారీ ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. మావోయిస్టు పార్టీకి దశాబ్దాలపాటు అత్యంత కీలక నేతగా వ్యవహరించిన మల్లోజుల వేణుగోపాల్‌రావు మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడణవీస్ ముందు లొంగిపోయిన మరుసటి రోజే మరో 170 మంది మావోయిస్టులు ఛత్తీస్‌గఢ్‌లో లొంగిపోయారు. ఈ విషయాన్ని కేంద్ర హోంమంత్రి అమిత్ షా వెల్లడించారు. 2026 మార్చి 31 నాటికి నక్సలిజాన్ని సమూలంగా నిర్మూలించేందుకు తాము కట్టుబడి ఉన్నామని పునరుద్ఘాటించారు. ఈ మేరకు ఆయన మిగతా.. 2లో



## ఎయిర్ ఇండియా విమాన ప్రమాదం

- న్యాయస్థానం పర్యవేక్షణలో దర్యాప్తు
- సుప్రీంను కోరిన పైలట్ సుమిత్ సభర్వాల్ తండ్రి

**న్యూఢిల్లీ,అక్టోబర్16(అక్షరగళం):** ఈ ఏడాది జూన్‌లో అహ్మదాబాద్‌లో చోటుచేసుకున్న ఘోర విమాన ప్రమాదం ఘటనలో 260 మంది మృతి చెందారు. ప్రధాన పైలట్ కెప్టెన్ సుమిత్ సభర్వాల్, కో-పైలట్ క్లైవ్ కుందర్ కూడా మరణించిన వారిలో ఉన్నారు. తాజాగా ఈ కేసులో న్యాయస్థానం పర్యవేక్షణలో దర్యాప్తు కోరుతూ.. సుమిత్ సభర్వాల్ తండ్రి పుష్కరాజ్ సభర్వాల్ సుప్రీం కోర్టును ఆశ్రయించారు. భారత పైలట్ల సమాఖ్య సైతం ఈమేరకు పిటిషన్ దాఖలు చేసింది. పైలట్‌గా సభర్వాల్‌కు విస్తృత అనుభవం ఉందని, 30 ఏళ్ల కెరీర్‌లో ఒక్కమచ్చ మిగతా.. 2లో

## జూబ్లీహిల్స్ ఎన్నికలో మద్దతు ఇవ్వండి

- సిపిఎంను కోరిన పిసిసి చీఫ్

**హైదరాబాద్,అక్టోబర్16(అక్షరగళం):** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్‌కుమార్ యాదవ్‌కు మద్దతివ్వాలని, బీసీలకు 42శాతం రిజర్వేషన్ల అమలు కోసం జరుగుతున్న పోరాటంలో ప్రభుత్వంతో కలిసి రావాలని సీపీఐ(ఎం)ను టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ కోరారు. గురువారం హైదరాబాద్‌లోని సీపీఎం కార్యాలయంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీతో ఆయన భేటీ అయ్యారు. పార్టీ నగర మిగతా.. 2లో



## జూబ్లీహిల్స్‌లో బోగస్ ఓట్లపై విచారణ

- ఇప్పుడు ఇసికి ఆదేశాలు ఇవ్వలేమన్న హైకోర్టు



**హైదరాబాద్,అక్టోబరు16 (అక్షరగళం):** జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో బోగస్ ఓట్లపై మాజీ మంత్రి కేటీఆర్, జూబ్లీహిల్స్ బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత దాఖలు చేసిన పిటిషన్‌పై తెలం గాణ హైకోర్టులో వాదనలు ముగిశాయి. పిటిషన్లపై న్యాయస్థానం కీలక వ్యాఖ్యలు చేసింది. ఇప్పటికే ఎలక్టోరల్స్‌ను ఈసీ రివిజన్ చేస్తోందని.. ఈ సమయంలో ఎలాంటి డైరెక్షన్ అవసరం లేదని స్పష్టం చేసింది. ప్రస్తుతం మిగతా.. 2లో

## నిమిషప్రియ కేసులో స్టే కొనసాగుతోంది

- మరణశిక్ష అమలుపై సుప్రీంకు కేంద్రం వివరణ



**న్యూఢిల్లీ,అక్టోబర్16(అక్షరగళం):** యెమెన్‌లో మరణశిక్షను ఎదుర్కొంటున్న భారత నర్సు నిమిష ప్రియకు శిక్ష అమలుపై స్టే కొనసాగుతోందని గురు వారం సుప్రీంకోర్టుకు కేంద్రప్రభుత్వం వెల్లడించింది. తీవ్రమైన మిగతా.. 2లో



## గుజరాత్ మంత్రుల సంచలన నిర్ణయం

- కేబినేట్ మొత్తం రాజీనామా
- నేడు కొత్త కేబినేట్ ప్రమాణం

**అహ్మదాబాద్,అక్టోబర్16(అక్షరగళం):** గుజరాత్ రాష్ట్ర క్యాబినెట్ సంచలన నిర్ణయం తీసుకుంది. గుజరాత్ కేబినెట్‌లోని మంత్రు లంతా గురువారం రాజీనామా చేశారు. సీఎం భూపేంద్ర పటేల్ మినహా మిగిలిన 16మంది మంత్రులంతా మిగతా.. 2లో

## శ్రీశైలంలో స్వామి అమ్మవార్లను
# దర్శించుకున్న మోడీ

(మొదటి పేజీ తరువాయి)

భ్రమరాంబ, మల్లికార్జున స్వామివారికి మోదీ పూజలు చేశారు. మల్లికార్జునస్వామికి పంచామృతాలలో రుద్రాభిషేకం, భ్రమరాంబదేవికి ఖడ్గమాల, కుంకుమార్చన పూజలు చేశారు. పూజల అనంతరం శివాజీ స్ఫూర్తి కేంద్రాన్ని సందర్శించారు. ఇక్కడి శివాజీ దర్బార్ హాల్, ధ్యాన మందిరాలను తిలకించారు. ప్రధానితో పాటు ఏపీ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ శ్రీశైలం చేరుకున్నారు. స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. ఉదయం ప్రత్యేక విమానంలో కర్నూలు చేరుకున్న ప్రధాని.. అక్కడి నుంచి సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌తో కలిసి హెలికాప్టర్‌లో సున్నిపెంటకు చేరుకున్నారు. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో శ్రీశైలం వెళ్లారు. ఆలయానికి చేరుకున్న ప్రధానికి అధికారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం దర్శన ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా సీఎం, డిప్యూటీ సీఎంతో కలిసి ప్రధాని మోదీ శ్రీభ్రమరాంబ, మల్లికార్జున స్వామివార్లను దర్శించుకున్నారు. మల్లికార్జునస్వామికి పంచామృతాలతో రుద్రాభిషేకం చేశారు. అమ్మవారి కుంకుమార్చన సేవలో పాల్గొన్నారు.



దర్శనానంతరం ప్రధానికి స్వామివారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. దర్శనానంతరం ప్రధాని నరేంద్ర మోదీ శ్రీశైలంలో శివాజీ స్ఫూర్తి కేంద్రాన్ని సందర్శించారు. రాజ దర్బార్ గోడలపై ఛత్రపతి శివాజీ జీవిత చరిత్రను తెలిపే శిల్పాలను ఆసక్తిగా పరిశీలించారు. అక్కడి శివాజీ విగ్రహం వద్ద నమస్కరించారు. శివాజీ దర్బార్ హాల్, ధ్యాన మందిరాలను పరిశీలించారు. ధ్యానముద్రలో ఉన్న శివాజీ, అమ్మవారి విగ్రహాలను దర్శించు కున్నారు. అమ్మవారి విగ్రహానికి భక్తిశ్రద్ధలతో పుష్పాలను సమర్పించారు. ప్రధానితో పాటు ఏపీ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ శివాజీ స్ఫూర్తి కేంద్రానికి వెళ్లారు. ఈ కేంద్రం నిర్వహణ బాగుందని ట్రస్టు నిర్వాహకులను ప్రధాని మోదీ అభినందించారు. అక్కడి నుంచి భ్రమరాంబ గెస్ట్‌హౌస్‌కు వెళ్లారు. ప్రధాని పర్యటన నేపథ్యంలో శ్రీశైలం పరిసర ప్రాంతాల్లో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. సున్నిపెంట వద్ద సుమారు 1500 మంది సిబ్బందితో భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

# ఎయిర్ ఇండియా విమాన ప్రమాదం

(మొదటి పేజీ తరువాయి)

కూడా లేదని ప్రస్తావించారు. ఈ నేపథ్యంలో సుప్రీం కోర్టు విశ్రాంత జడ్జి నేతృత్వంలో.. స్వతంత్ర నిపుణుల కమిటీతో న్యాయ పర్యవేక్షణలో దర్యాప్తు చేయించాలని డిమాండ్ చేశారు. జూన్ 12న అహ్మదాబాద్ నుంచి లండన్ బయల్దేరిన ఎయిరిండియా విమానం టేకాఫ్ అయిన వెంటనే కూలిపోయింది. ఈ ప్రమాదంపై ఏఏఐబీ జులైలో తన ప్రాథమిక నివేదికను విడుదల చేసింది. రెండు ఇంజిన్లకు ఇంధన సరఫరా నిలిచిపోవడంవల్లే విమానం కూలిపోయిందని పేర్కొంది. ఇంధన సరఫరాను ఎందుకు ఆపావని ఒక పైలట్ ప్రశ్నించగా.. తాను ఆపలేదని మరో పైలట్ సమాధానమివ్వడం కాక్‌పిట్ వాయిస్ రికార్డర్‌లో నమోదైందని తెలిపింది. ఇదికాస్త పైలట్ల లోపం ఉందనే ఊహాగానాలకు దారితీసింది. ఈ నివేదికను పైలట్ సంఘాలు తీవ్రంగా విమర్శించాయి. పైలట్లపై నిందలు దురదృష్ట కరమని సుప్రీం కోర్టు సైతం వ్యాఖ్యానించింది. ఇప్పుడు దర్యాప్తుపై పైలట్ తండ్రి సుప్రీం గడప తొక్కారు. ఎయిరిండియా విమాన ప్రమాదంపై ప్రాథమిక దర్యాప్తు లోపభూయిష్టంగా ఉందని పిటిషనర్లు విమర్శించారు. దర్యాప్తు బృందం ప్రధానంగా పైలట్లపైనే దృష్టి సారించిందని ఆరోపించారు. ఈ విషాదానికి దారితీసిన సాంకేతిక, విధానపరమైన అంశాలను పరిశీలించడంలో విఫలమైందన్నారు. నివేదికలోని ఎంపిక చేసిన భాగాలను బహిర్గతం చేయడం ద్వారా వాస్తవాలను తప్పుదోవ పట్టించడం.. ముఖ్యంగా పైలట్లను లక్ష్యంగా చేసుకోవడం వంటివి అసలైన కారణాలను గుర్తించడాన్ని కష్టతరం చేస్తాయని పిటిషనర్లు పేర్కొన్నారు. 'విమాన ప్రమాదాల దర్యాప్తు బ్యూరో' నియంత్రణలోని దర్యాప్తు బృందం కూర్పునూ ప్రశ్నించారు. ఇందులో డీజీసీఏ, విమానయాన అధికారులే ఉన్నారని చెప్పారు. ఏ వ్యక్తి కూడా తన సొంత కేసులో న్యాయమూర్తిగా ఉండకూడదనే సహజ న్యాయ సూత్రాన్ని ఇది ఉల్లంఘిస్తోందన్నారు.

# గుజరాత్ మంత్రుల సంచలన నిర్ణయం

(మొదటి పేజీ తరువాయి)

తమ పదవులకు గుడ్ బై చెప్పారు. మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ చేయాలని నిర్ణయించడంతో మంత్రులంతా రాజీనామా చేయాల్సి వచ్చింది. శుక్రవారం కొత్త మంత్రివర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం జరగనున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు 'గుజరాత్ ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్ మంత్రివర్గాన్ని శుక్రవారం మధ్యాహ్నం 12:39 గంటలకు విస్తరించనున్నారు' అని వెల్లడిస్తూ ఆ రాష్ట్ర ప్రభుత్వం ఓ ప్రకటన విడుదల చేసింది. అయితే, మంత్రివర్గ విస్తరణలో భాగంగా సగం మంది వరకూ పాత మంత్రులే ఉండొచ్చని తెలుస్తోంది. అలాగే 10 మంది వరకూ కొత్త వారిని మంత్రులుగా తీసుకునే అవకాశం ఉందని సమాచారం. ధర్మేంద్ర సిన్హ్, రిషికేశ్ పటేల్, ముఖేష్ పటేల్, భూపేంద్రసింగ్ చుడాసమా తిరిగి తమ మంత్రి పదవులను దక్కించుకునే అవకాశం ఉందని.. అలాగే కనుభాయ్ దేశాయ్, రాఘవ్జీ పటేల్, కున్వర్జీ బవలియా, మురుభాయి బెరా స్థానంలో కొత్త వారిని తీసుకునే అవకాశాలు ఉన్నట్లు ఊహాగానాలు వినిపిస్తున్నాయి. కాగా, ప్రస్తుతం గుజరాత్ మంత్రివర్గంలో సీఎం పటేల్ సహా 17మంది మంత్రులు ఉన్నారు. ఎనిమిది మంది క్యాబినెట్ స్థాయి మంత్రులు కాగా.. మిగతా వారు సహాయ మంత్రులుగా ఉన్నారు. గుజరాత్ అసెంబ్లీలో మొత్తం 182 మంది సభ్యులు ఉన్నారు. ఈ 182 మంది సభ్యులున్న అసెంబ్లీలో 27 మంది లేదా మొత్తం సభలో 15శాతం మంది మంత్రులు ఉండొచ్చు. మరోవైపు నూతన మంత్రివర్గ ప్రమాణస్వీకారానికి కేంద్ర హోంమంత్రి అమిత్ షా, జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా సహా బీజేపీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు భారీగా హాజరవుతారని భావిస్తున్నారు. ఈ మేరకు గురువారం నాటికి బీజేపీ ఎమ్మెల్యేలంతా గాంధీనగర్‌కు చేరుకోవాలని పార్టీ సైతం ఆదేశాలు జారీ చేసింది. అయితే, మంత్రి పదవులు ఎవరెవరికి దక్కుతాయనే అంశం ఇప్పుడు గుజరాత్ రాజకీయాల్లో హాట్ టాపిక్ గా మారింది.

# నిమిషప్రియ కేసులో స్టే కొనసాగుతోంది

(మొదటి పేజీ తరువాయి)

పరిణామాలు ఏమీ జరగలేదని తెలిపింది. ఈ భారతీయ నర్సును కాపాడేందుకు కేంద్ర ప్రభుత్వం దౌత్యమార్గాలను ఉపయోగించేలా ఆదేశించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు విచారిస్తోంది. తాజాగా ఆ మరణశిక్ష గురించి ప్రశ్నించింది. ఆమెకు చట్టపరమైన సహకారం అందిస్తోన్న 'సేవ్ నిమిషప్రియ ఇంటర్నేషనల్ యాక్షన్ కౌన్సిల్' తరఫు న్యాయవాది స్పందిస్తూ.. శిక్ష అమలుపై స్టే కొనసాగుతోందని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం తరఫున అటార్నీ జనరల్ వెంకటరమణి మాట్లాడుతూ.. ప్రస్తుతం ఈ కేసులోకి కొత్త మధ్యవర్తి వచ్చారు. ఇప్పటివరకు మంచి విషయం ఏంటంటే.. తీవ్రమైన పరిణామాలు చోటుచేసుకోకపోవడమేనని వెల్లడించారు. ఈ వాదనలు విన్న అత్యున్నత న్యాయస్థానం కేసును జనవరికి వాయిదా వేసింది. అయితే ఏవైనా అత్యవసర పరిస్థితులు ఉంటే.. ముందస్తు లిస్టింగ్ కోసం దరఖాస్తు చేసుకునే వెసులుబాటు కల్పించింది. నిమిష ప్రియ నర్సింగ్ కోర్సు పూర్తిచేసిన తర్వాత 2008లో యెమెన్ వెళ్లి అక్కడే ఉద్యోగంలో చేరారు. ఆ దేశ నిబంధనల ప్రకారం స్థానిక వ్యక్తి తలాల్ అదిబ్ మెహది భాగస్వామ్యంతో అల్‌అమన్ మెడికల్ కౌన్సిల్ సెంటర్‌ను ప్రారంభించారు. తర్వాత ఆ వ్యక్తి ప్రియను వేధించి, పాస్‌పోర్ట్, ఇతర పత్రాలను లాక్కొన్నాడన్న ఆరోపణలు ఉన్నాయి. 2016లో అతడిపై ప్రియ పోలీసులకు కూడా ఫిర్యాదు చేసింది. కానీ, వారు ఆమెను పట్టించుకోలేదు. దీంతో 2017లో మెహదికి మత్తుమందు ఇచ్చి అతడి వద్ద ఉన్న తన పాస్‌పోర్టును స్వాధీనం చేసుకోవాలని భావించింది. కానీ, ఆ డోస్ ఎక్కువకావడంతో అతడు చనిపోయాడు. ఆ తర్వాత మృతదేహాన్ని ఓ వాటర్ ట్యాంక్‌లో పారేసింది. చివరికి అక్కడినుంచి సౌదీకి వెళ్లిపోతుండగా.. సరిహద్దుల్లో ఆమెను అరెస్టు చేసి, మరణశిక్ష విధించారు. భారత ప్రభుత్వం, మత పెద్దల ప్రయత్నాలతో ప్రస్తుతానికి ఆ శిక్ష అమలు వాయిదాపడింది.

# జూబ్లీహిల్స్‌లో బోగస్ ఓట్లపై విచారణ

(మొదటి పేజీ తరువాయి)

ఎలాంటి ఉత్తర్వులు ఇవ్వలేమని తేల్చిచెప్పింది హైకోర్టు. ఓటో చోరీపై హైకోర్టులో బీఆర్‌ఎస్ లంచ్ మోషన్ పిటిషన్ దాఖలు చేయగా.. గురువారం విచారణ జరిగింది. బీఆర్‌ఎస్ తరపు న్యాయవాది మాట్లాడుతూ.. జూబ్లీహిల్స్‌తో సంబంధంలేని వారు ఓటరు జాబితాలో చేరారని తెలిపారు. బోగస్ ఓట్లపై ఎన్నికల సంఘానికి ఆధారాలు సమర్పించామని వాదనలు వినిపించారు. ఈసీ తరపు లాయర్ మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ రిప్రజెంటేషన్‌లపై ఎన్నికల అధికారిని ఆదేశించామని.. నివేదికను బట్టి చర్యలు తీసుకుంటామని వాదించారు. ఇరువురి వాదనలు విన్న హైకోర్ట్ ధర్మాసనం బోగస్ ఓట్లపై ఈసీకి ఆదేశాలు ఇవ్వలేమని స్పష్టం చేస్తూ విచారణను ముగించింది.

# బిసి రిజర్వేషన్లపై వెనక్కి తగ్గేది లేదు

(మొదటి పేజీ తరువాయి)

నివేదిక ఇవ్వాలని అధికారులకు సీఎం రేవత్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. ఈ విషయంలో వెనక్కి తగ్గేది లేదని, ముందుకు వెళ్లాలని కేబినేట్‌లో నిర్ణయించారు. ఇకపోతే స్థానిక ఎన్నికల్లో ముగ్గురు పిల్లలు ఉంటే పోటీచేయకుండా తీసుకున్న నిర్ణయాన్ని ఎత్తివేస్తూ కేబినేట్ ఆమోదించింది. సిఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన గురువారం సచివాలయంలో జరిగిన కేబినేట్‌లోకీలక నిర్ణయాలు తీసుకున్నారు. వివరాలను సమాచారశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మీడియాకు వివరించారు. ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు కావస్తున్నందున డిసెంబరు 1 నుంచి 9వ తేదీ వరకు ప్రజాపాలన – ప్రజా విజయోత్సవాలు నిర్వహించాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. ప్రజా ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లయిన సందర్భంగా ఉత్సవాలు నిర్వహించాలని మంత్రివర్గ సమావేశంలో నిర్ణయించారు. ప్రధానంగా బీసీ రిజర్వేషన్లు, రైతు భరోసా, మైనింగ్ కొత్త పాలసీ, మెట్రో ఫేజ్–2 టెండర్లపై చర్చించారు. మెట్రో ఫేజ్–2పై సమావేశంలో ఓ నిర్ణయం తీసుకున్నారు. దీనికి సిఎస్ అధ్యక్షతన కేబినేట్ సబ్‌కమిటీ వేశారు. అయితే, కేబినెట్ భేటీకి మంత్రి కొండా సురేఖ హాజరు కాలేదు. తన ఇంటికి పోలీసులు రావడంపై ఆగ్రహంగా ఉన్నారు మంత్రి కొండా సురేఖ. ఈ నేపథ్యంలోనే కేబినెట్ భేటీకి రాకూడదని మంత్రి సురేఖ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. అలాగే, జయశంకర్ వర్సిటీకి మూడు కొత్త వ్యవసాయ కళాశాలలకు కేబినేట్ ఆమోదం తెలిపింది. వ్యవసాయ కళాశాలలు లేని ఉమ్మడి నల్లగొండ, నిజామాబాద్, వికారాబాద్ జిల్లాల్లో ఈ విద్యా సంవత్సరం నుంచి ప్రారంభించేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అలాగే,ఆర్ అండ్ బీ హ్యామ్ రోడ్లకు కేబినెట్ ఆమోదం తెలిపింది. రూ. 10,500 కోట్లతో నిర్మించే 5500 కిలోమీటర్ల హ్యామ్ రోడ్లకు కేబినెట్ ఆమోదించింది. త్వరలో టెండర్లు పిలవాలని కేబినెట్ నిర్ణయం తీసుకుంది. స్థానిక ఎన్నికల్లో పోటీకి ఇద్దరు పిల్లలు నిబంధనపై తెలంగాణ కేబినెట్ కీలక నిర్ణయం తీసుకుంది. ఇద్దరు పిల్లల నిబంధన తొలగించాలని మంత్రివర్గం నిర్ణయించింది. పలు రంగాలకు భూ కేటాయింపులు జరిపేందుకు కేబినెట్ ఆమోదం తెలిపిందన్నారు. మద్దతు ధరతో పాటు సన్నవడ్లకు బోనస్ కూడా ఇస్తామన్నారు. వరి రికార్డు స్థాయిలో పండిందని, దానిని పూర్తిగా కొనుగోలు చేస్తామని అన్నారు.

'రాష్ట్రంలో కొత్తగా 3 వ్యవసాయ కళాశాలల ఏర్పాటుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. నల్సార్‌లో స్థానిక విద్యార్థులకు 50శాతం సీట్లు ఇవ్వాలని కేబినెట్ తీర్మానించింది. నల్సార్ వర్సిటీకి గతంలో ఇచ్చిన దానికంటే అదనంగా 7 ఎకరాలు ఇస్తాం. రైతులు పండించిన ధాన్యం మొత్తం కొనుగోలు చేయాలని నిర్ణయించాం. కేంద్రం కొనుగోలు చేసినా.. చేయకపోయినా మా ప్రభుత్వం కొనుగోలు చేస్తుంది. మెట్రో రెండో దశను క్షుణ్ణంగా పరిశీలించేందుకు సీఎస్ ఛైర్మన్‌గా కమిటీ ఏర్పాటు చేశామని మంత్రి పొంగులేటి తెలిపారు.

# వ్యూస్, లైక్స్‌తో సోషల్ మీడియాలో ఫేమస్

(మొదటి పేజీ తరువాయి)

అసభ్యకరమైన కంటెంట్ చేస్తూ సభ్య సమాజానికి ఏం సందేశం ఇస్తున్నారని నిలదీశారు. చిన్నారులు, యువతకి స్ఫూర్తినిచ్చే, ఆదర్శంగా నిలిచే వ్యక్తులను ఇంటర్వ్యూలు చేసి సమాజాభివృద్ధికి దోహదం చేయండి. అంతేకానీ.. ఇలాంటి వీడియోలు వారితో చేసి పిల్లలను పెడదోవ పట్టించవద్దు. గుర్తు పెట్టుకోండి.. ఇది బాలల హక్కుల ఉల్లంఘనే కాదు.. చట్టరీత్యా నేరం. ఇటువంటి చర్యలు పోక్సో, జువైనల్ జస్టిస్ చట్టాలను ఉల్లంఘించడమే అవుతుందని హెచ్చరించారు. పిల్లలను ఇలాంటి కంటెంట్‌లో భాగం చేయడం వారిని వేధించడం కిందికే వస్తుంది. మైనర్లతో ఈ తరహా కంటెంట్ చేసే వారిపట్ల పోలీస్‌శాఖ కఠినంగా వ్యవహరిస్తుంది. బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటుంది. తక్షణమే వీటిని తొలగించకున్నా.. భవిష్యత్తులో ఇలాంటి కంటెంట్ అప్‌లోడ్ చేసినా చట్టప్రకారం కేసులు నమోదు చేస్తాం అని కూడా హెచ్చరించారు. సోషల్ మీడియాలో ఇలాంటి వీడియోలు మీ దృష్టికి వస్తే వెంటనే రిపోర్టు చేయండి. స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వండి. హెల్ప్‌లైన్ నంబర్ 1930కి గానీ.. జాతీయ సైబర్ క్రైమ్ పోర్టల్ లో ఫిర్యాదు చేయండని సూచించారు. తల్లిదండ్రులుగా పిల్లలను పెంచడం మాత్రమే కాదు.. వారి బాల్యం, మానసిక ఆరోగ్యం, భవిష్యత్తును కాపాడటం కూడా మీ బాధ్యతే అనే విషయం మరిచిపోవద్దని సజ్జనార్ పేర్కొన్నారు.

# మావోయిస్టులకు వరుస ఎదురుదెబ్బలు

(మొదటి పేజీ తరువాయి)

'ఎక్స్'లో సుదీర్ఘ పోస్టు పెట్టారు. నిన్న ఛత్తీస్‌గఢ్‌లో 27మంది; మహారాష్ట్రలో 61 మంది జనజీవన స్రవంతిలోకి వచ్చారన్నారు. దీంతో రెండు రోజుల వ్యవధిలో 258 మంది లొంగిపోయారన్న అమిత్ షా.. నక్సలిజంపై పోరులో ఇదో పెద్ద విజయమన్నారు. భారత రాజ్యాంగంపై తమ విశ్వాసాన్ని ప్రకటిస్తూ హింసను త్యజించాలనే వీరి నిర్ణయాన్ని అభినందిస్తున్నట్లు అమిత్ షా తెలిపారు.

ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం వామపక్ష తీవ్రవాదాన్ని అంతం చేసేందుకు చేస్తున్న ప్రయత్నాల ఫలితాలను ఇది ప్రతిబింబిస్తుందన్నారు. తమ విధానం స్పష్టంగా ఉందన్న అమిత్ షా.. లొంగిపోయేవారిని స్వాగతిస్తామని.. ఇంకా తుపాకీతో ఉద్యమం కొనసాగించాలను కొనేవారు భద్రతా దళాల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. నక్సలిజం మార్గంలో ఇంకా కొనసాగుతున్న వారు ఆయుధాలను విడిచిపెట్టి జనజీవన స్రవంతిలో చేరాలని మరోసారి విజ్ఞప్తి చేశారు.

ఒకప్పుడు వామపక్ష తీవ్రవాద స్థావరాలుగా ఉన్న ఛత్తీస్‌గఢ్‌లోని అబూజ్‌మడ్, ఉత్తర బస్తర్‌లు విముక్తిపొందిన ప్రాంతాలుగా ప్రకటించడం సంతోషదాయకమని తెలిపారు.





ఇప్పుడు దక్షిణ బస్తర్‌లో నక్సలిజం జాడ ఉందని.. దీన్ని భద్రతా దళాలు త్వరలో తుడిచిపెడతాయని పేర్కొన్నారు. ఛత్తీస్‌గఢ్‌లో భాజపా సర్కార్ ఏర్పాడిన తర్వాత జనవరి 2024 నుంచి 2,100 మంది మావోయిస్టులు లొంగిపోగా, 1785మందిని అరెస్టు చేశారని తెలిపారు. 477 మందిని భద్రతాదళాలు నిర్మూలించాయని తెలిపారు.

లొంగిపోయిన వారిలో సతీష్ అలియాస్ టి. వాసుదేవరావు సహా 10 మంది సీనియర్ మావోయిస్టులు ఉన్నట్లు సమాచారం. లొంగిపోయిన వారి జాబితాలో రాణిత, భాస్కర్, నీలా అలియాస్ నందే, దీపక్ పాలో సహా పలువురు ఉన్నారు. వీరిలో వాసుదేవరావు తలపై రూ.కోటి రివార్డు ఉండగా.. మరికొందరిపై లక్షల్లో రివార్డులు ఉన్నట్లు తెలుస్తోంది.



**తెలంగాణ భవన్ వేదికగా జరిగిన కార్యక్రమంలో సామాజిక, రాజకీయ స్పృహతో విజయ్ కుమార్ పిన్నింటి రచించిన "నా ఆలోచనలు" పుస్తకాన్ని ఆవిష్కరించిన బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిండెంట్ కేటీఆర్. ఈ పుస్తక ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ శాసనసభ్యులు తాటికొండ రాజయ్య , బాల్క సుమన్ , బీ=వి రాష్ట్ర ఉపాధ్యక్షులు డా: తుంగ బాలు , బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు ఏనుగుల రాకేష్ రెడ్డి , రాజేందర్, రాజేష్ నాయక్ పాల్గొన్నారు.**

## జూబ్లీహిల్స్ ఎన్నికలో
# మద్దతు ఇవ్వండి

(మొదటి పేజీ తరువాయి)

కమిటీతో చర్చలు జరుగుతున్నాయని, ఈ నెల 20న జరిగే తమ పార్టీ రాష్ట్ర కమిటీ సమావేశాల్లో నిర్ణయాన్ని ప్రకటిస్తామని జాన్‌వెస్లీ తెలిపారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అంశంలో రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని సూచించారు. దీనిపై మహేశ్‌కుమార్ గౌడ్ సానుకూలంగా స్పందించారు. ఈ సమావేశంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి, టి.జ్యోతి, టి. సాగర్, మల్లు లక్ష్మి, అబ్బాస్, బండారు రవికుమార్, పలువురు రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు.

## మీడియాకు ఎక్కి
# రచ్చ చేయవద్దు

### కొండాసురేఖకు మీనాక్షి సున్నిత హెచ్చరిక



హైదరాబాద్,అక్టోబర్16(అక్షరగళం): తెలంగాణ మంత్రి కొండా సురేఖతో ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్ ఫోన్‌లో మాట్లాడారు. మీడియా ముందుకు వెళ్లవద్దని కొండా సురేఖకు ఆమె సూచించారు. కూర్చొని మాట్లాడదామని మీనాక్షి నటరాజన్ చెప్పినట్లు సమాచారం. మంత్రి కొండా సురేఖ ఓఎస్డీగా ఉన్న సుమంత్‌ను ఆ బాధ్యతల నుంచి ఇటీవల తప్పించిన విషయం తెలిసిందే. ఉమ్మడి నల్గొండ జిల్లాలోని సిమెంటు కంపెనీల యాజమాన్యాలను ఆయన బెదిరించినట్లు ప్రభుత్వం దృష్టికి రావడంతో గట్టిగా వ్యవహరించాలని నిర్ణయించినట్లు సమాచారం. ఈ పరిణామాల నేపథ్యంలో హైదరాబాద్‌లో కొండా సురేఖ ఇంటికి పోలీసులు వెళ్లారు. సురేఖ నివాసంలో ఆమె మాజీ ఓఎస్డీ సుమంత్ ఉన్నారన్న సమాచారంతో మఫ్టీలో ఉన్న పోలీసులు అక్కడికి చేరుకున్నారు. మంత్రి కుమార్తె సుస్మిత వారిని ప్రశ్నించారు. ఈ క్రమంలో ఆమె మీడియాతో మాట్లాడుతూ తమపై బురదజల్లేందుకు కాంగ్రెస్ పార్టీ పెద్దలే ఇవన్నీ చేయిస్తున్నారని ఆరోపించారు. తన తల్లిదండ్రులనే లక్ష్యంగా చేసుకుని కుట్రలు పన్నుతున్నారని అన్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో కొండా సురేఖతో మీనాక్షి నటరాజన్ మాట్లాడినట్లు తెలిసింది. ఈ వ్యవహారాన్ని ఇంతటితో సమసిపోయేట్లు చూద్దామని ఆమె చెప్పినట్లు సమాచారం.

# అవును.. ఆ ఆరడుగుల బుల్లెట్ ట్రబుల్ షూటరే!

- ఆ వలస కార్మికులకు ఎట్టకేలకు మోక్షం
- హరీశ్‌రావు చొరవతో వారంరోజుల్లో తెలంగాణకు చేరుకోనున్న 12 మంది గల్ఫ్ కార్మికులు
- జోర్డాన్‌లో చిక్కుకున్న వలస కార్మికులకుఇచ్చిన మాట నిలుపుకున్న మాజీ మంత్రి హరీశ్ రావు
- వారం రోజులుగా వారిని స్వదేశానికి రప్పించేం దుకు అన్ని విధాలుగా ప్రయత్నాలు చేసిన హరీశ్ రావు
- బీఆర్ఎస్ రాజ్యసభ ఫ్లోర్ లీడర్, ఎంపీ సురేష్ రెడ్డి సమన్వయంతో సంబంధిత కంపెనీ ప్రతినిధులతో మాట్లాడి, కార్మికులను పంపించేందుకు ఒప్పించిన హరీశ్ రావు
- కంపెనీకి చెల్లించాల్సిన మెత్తాన్ని స్వయంగా భరిస్తూ, విమాన టికెట్లు సైతం ఏర్పాటు చేసిన హరీశ్ రావు
- సంతోషం వ్యక్తం చేస్తున్న జోర్డాన్‌లో ఉన్న తెలంగాణ గల్ఫ్ కార్మికులు..
- తమ వారు తిరిగి స్వదేశానికి వస్తుండటంతో వారి కుటుంబాల్లో వెల్లివిరుస్తున్న ఆనందం
- కేసీఆర్ పాలనలో వలసలు వాపస్.... నేడు మళ్లీ మొదలు
- మాజీ మంత్రి హరీశ్ రావు వ్యాఖ్య

హైదరాబాద్: "బతుకుబండిని నడిపేందుకు, కుటుంబాలను పోషించేందుకు జోర్డాన్ వెళ్లాం. కానీ ఇప్పుడు స్వదేశానికి తిరిగి వచ్చే మార్గమే కనిపించట్లేదు సార్ మమ్మల్ని కాపాడండి" అని పంపిన ఒక్క వాట్సప్ మెసేజ్ వారికి దారి చూపింది. బీఆర్ఎస్ పార్టీ రూపంలో తెలంగాణకు చేరుకునేందుకు బాటలు వేసింది.

తెలంగాణ గల్ఫ్ కార్మికుల గోడును విన్న మాజీ మంత్రి హరీశ్ రావు , కేసీఆర్ ఆదేశాలతో 12 మందిని ఎలాగైనా రప్పించాలని నిశ్చయించుకున్నారు. వారి స్థితిగతులను ఎప్పటి కప్పుడు తెలుసుకోవాలని తన కార్యాలయానికి సూచించారు. 12 మందికి స్వయంగా తానే ఫోన్ చేసి 'ధైర్యంగా ఉండండి ఎట్లయినా మిమ్మల్ని తెలంగాణకు తీసుకువస్తాం' అని భరోసా ఇచ్చారు.

ఒకవైపు జోర్డాన్ గల్ఫ్ కార్మికుల సమస్యను రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ సహా మీడియా దృష్టికి తీసుకువెళ్లిన హరీశ్ రావు, మరోవైపు బిఆర్ఎస్ ఎంపీ సురేశ్ రెడ్డి ద్వారా భారత విదేశీ వ్యవహారాల శాఖ అధికారుల దృష్టికి సమస్యను తీసుకువెళ్లారు. ఇంకోవైపు సంబంధిత కంపెనీ ప్రతినిధులతో చర్చలు జరిపారు. ఈ క్రమంలో పెనాల్టీ చెల్లించి వారిని తెలంగాణకు తీసుకువెళ్లవచ్చు అని కంపెనీ చెప్పగా దానికి అంగీకరించారు.





గల్ఫ్ కార్మికుల ఆర్థిక ఇబ్బందుల దృష్ట్యా చెల్లించాల్సిన మొత్తంతో పాటు, స్వదేశానికి రావడానికి అయ్యే విమాన టికెట్లను సైతం స్వయంగా హరీశ్ రావు భరించారు. దీంతో విమాన టికెట్ల బుకింగ్ ప్రక్రియ సైతం పూర్తయింది. మరో వారంలో నిజామాబాద్, నిర్మల్, కామారెడ్డి, జగిత్యాల, సిద్దిపేటలకు చెందిన 12 మంది గల్ఫ్ కార్మికులు తెలంగాణ గడ్డపై అడుగుపెట్టబోతున్నారు. సుదీర్ఘ కాలపు ఎదురుచూపుల తర్వాత వారి కుటుంబాలను కలుసుకోబోతున్నారు.

ప్రభుత్వంలో ఉన్న పెద్దలు చేయలేని పని, ప్రతిపక్షంలో ఉన్న హరీశ్ రావు చేసి, ప్రజలకు సేవ చేసేందుకు అధికారంతో సంబంధం లేదని నిరూపించారు. 12 మంది కుటుంబాల్లో వెలుగులు నింపుతున్నారు.

త్వరలో స్వదేశానికి రాబోతున్నాం, కుటుంబ సభ్యులను కలుసుకోబో తున్నామని జోర్డాన్‌లో ఉన్న గల్ఫ్ కార్మికులు ఆనందం వ్యక్తం చేస్తుండగా, మరోవైపు తమ వారు సొంతూళ్లకు రాబోతున్నారని వారి కుటుంబ సభ్యులు సంతోషపడుతున్నారు. ఇందుకు ఎంతగానో కృషి చేసిన హరీశ్ రావుకి ధన్యవాదాలు చెబుతున్నారు.

### వలసలు మళ్లీ మొదలు: మాజీ మంత్రి హరీశ్ రావు

కేసీఆర్ ఆదేశాలతో జోర్డాన్‌లో చిక్కుకున్న 12 మంది తెలంగాణ గల్ఫ్ కార్మికులను తిరిగి స్వదేశానికి తీసుకు వచ్చేందుకు అన్ని విధాలుగా ఏర్పాటు చేసాం. వారం రోజుల్లో ఇక్కడకు చేరుకుంటారు. ఇది నాకెంతో సంతృప్తిని కలిగిస్తున్నది. అభివృద్ధి, సంక్షేమం సమ ప్రాధాన్యంగా సాగిన కేసీఆర్ గారి పాలనలో వలసలు వాపస్ అయితే, రేవంత 22 నెలల పాలనలో వలసలు మల్లా మొదలయ్యాయి.

అన్ని వర్గాల ప్రజలను మోసం చేసినట్లుగానే, గల్ఫ్ కార్మికులను సైతం కాంగ్రెస్ పార్టీ మోసం చేసింది. అభయ హస్తం మేనిఫెస్టోలో చెప్పిన గల్ఫ్ కార్మికులు, ఎన్నారైల సంక్షేమ బోర్డు ఇప్పటికీ అతీగతీ లేదు. కనీసం టోల్ ఫ్రీ నెంబర్ కూడా ఏర్పాటు చేయలేదు. ప్రభుత్వం ఇప్పటికైనా గల్ఫ్ కార్మికుల సంక్షేమంపై దృష్టి సారించాలని డిమాండ్ చేస్తున్నాం.



తెలుగు దినపత్రిక https://aksharagalam.com


అక్షరగళం

ప్రతి అక్షరం ప్రజల కోసం

# తెలంగాణ రౌండప్

## నేడు రంగారెడ్డి జిల్లా డిసిసి అధ్యక్షుని ఎన్నిక అభిప్రాయ సేకరణ

**తలకొండపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు డోకూరు ప్రభాకర్ రెడ్డి**





**కల్వకుర్తి అక్టోబర్16( అక్షర గళం):** రంగారెడ్డి జిల్లా డిసిసి అధ్యక్షుని ఎన్నిక అభిప్రాయ సేకరణకు శుక్రవారం ఆమనగల్ పట్టణ కళ్యాణి గార్డెన్స్ లో రెండు గంటలకు నిర్వహించే అభిప్రాయ సేకరణకు ఆమనగల్, కడ్తాల్,మాడ్గుల, తలకొండపల్లి మండలాల ముఖ్య నాయకులు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో హాజరుకావాలని తలకొండపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు డోకూరి ప్రభాకర్ రెడ్డి గురువారం మీడియాకు తెలిపారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తిరునల్వేలి ఎంపీ రాబర్ట్ బ్రోస్ ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, ఎమ్మెల్సీ అద్దంకి దహాకర్, డిసిసి అధ్యక్షుడు చల్ల నరసింహారెడ్డి, టిపిసిసి వైస్ ప్రెసిడెంట్ వినయ్ కుమార్ రెడ్డి, కార్పొరేటర్ విజయ రెడ్డి హాజరవుతున్నట్లు డోకుర్ ప్రభాకర్ రెడ్డి తెలిపారు.



## పౌష్టికాహారం తీసుకోవాలి

**- సూపర్వైజర్ రాధిక**

**ఆమనగల్లు, అక్టోబర్ 16 (అక్షర గళం):**

సేంద్రియ ఎరువులతో పండించిన కూరగాయలు, ఆకుకూరలు తీసుకుంటే ఆరోగ్యంగా ఉంటారని సెక్టార్ సూపర్వైజర్ రాధిక అన్నారు. గురువారం ఆమనగల్లు మండలం ఆకుతోటపల్లి గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో పోషణ మాసోత్సవం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా సూపర్వైజర్ రాధిక హాజరై మాట్లాడుతూ.. పోషణ మాసం ఉద్దేశాన్ని మహిళలందరికీ వివరించారు. అలాగే గర్భవతి దశ నుంచి వెయ్యి రోజులు తల్లీ బిడ్డకు ప్రతీ నెల ఆరోగ్య పరీక్షలు, బరువు, ఎత్తులు వ్యాధి నిరోధక టీకాలు వేయించాలన్నారు. అలాగే పరిసరాల పరిశుభ్రత పాటించి మొక్కలు నాటుకోవాలని వివరించారు. - నేటి బాలలే రేపటి పౌరులుగా ఎదగాలంటే చిన్న నాటి నుంచి క్రమశిక్షణతో కూడిన భోజనంతో పాటు, సరైన విద్యను అందించాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, అంగన్వాడి టీచర్లు విజయలక్ష్మి, నాగ శిరోమణి, అలివేలు, సారమ్మ, రాములమ్మ, ముత్యాలమ్మ, భారతమ్మ, సువర్ణ, లక్ష్మీ, సాలి మరియు తల్లులు పాల్గొన్నారు.

## ప్రజాస్వామ్యం అపహాస్యం

**- టీపీసీసీ సభ్యులు శ్రీనివాస్ గౌడ్**

**- ఓట్ల గల్లంతుకు బీజేపీ, బీఆర్ఎస్ కుట్ర**

**ఆమనగల్లు, అక్టోబర్ 16 (అక్షర గళం):** దేశ వ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో వ్యతిరేకంగా ఉన్న లక్షల ఓట్లను తొలగిస్తూ, ఓట్ల చోరీకి పాల్పడుతూ బీజేపీ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తోందని టీపీసీసీ సభ్యులు అయిళ్ల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. కడ్తాల్ మండల పరిధిలోని మైసిగండిలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఓట్ చోరీపై సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ బలంగా ఉన్న చోట్ల బీజేపీ ఓట్ల చోరీతో అధికారంలోకి వస్తోందన్నారు. మోదీ-అమిత్





షా నాయకత్వంలోని బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగ విరుద్ధంగా, దొంగ ఓట్లతో అధికారం లోకి వచ్చిందని విమర్శించారు. దేశ ప్రజాస్వామ్య వ్యవస్థను దెబ్బతీసే ప్రయత్నం చేస్తున్న బీజేపీ కుట్రలను ప్రజలు తిప్పికొట్టాలని, రాహుల్ గాంధీ చేపట్టిన ఈ ఉద్యమానికి సంఘీభావం తెలపాలని కోరారు. కార్యక్రమంలో జవహర్ లాల్ నాయక్, హిరా సింగ్ నాయక్, స్టాలిన్, కిషన్, తులసిరామ్ నాయక్, చిల్లి శంకర్, రాము నాయక్, సుధీర్, గోపి, జగన్, రమేష్, నరేష్, చిన్న, అమర్ సింగ్, సాయి, మోత్య, రాజు, చాత్రు, మల్లేష్, కంశ, శంకర్, చందర్, శీను, పాండు, చిన్న, బుజ్జి, కంలి, నీల, తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలి

**- ఎంపీడీఓ కుసుమ మాధురి**

**ఆమనగల్లు, అక్టోబర్ 16 (అక్షర గళం):** ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని ఎంపీడీఓ కుసుమ మాధురి సూచించారు. గురువారం ఆమనగల్లు మండలం రాంనుంతల గ్రామ పంచాయతీ పరిధిలోని పెద్దతండా, గేట్ తండా లలో ఇందిరమ్మ ఇళ్ల



నిర్మాణాలను పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. త్వరితగతిన నిర్మాణాలను పూర్తి చేసుకోవాలని సూచించారు.

గ్రామంలో మంజూరైన ఇళ్లు, నిర్మాణాలు ప్రారంభించిన లబ్ధిదారుల వివరాలను జీపీ కార్యదర్శి బాల మల్లేష్ ను అడిగి తెలుసుకున్నారు. హౌసింగ్, పంచాయతీ కార్యదర్శులు సమన్వయంతో పని చేసి ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేసుకునేలా పర్యవేక్షణ చేయాలని సూచించారు. ఇసుకను నిబంధనల మేరకు సరాఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలని, బిల్లులు పెండింగ్లో ఉండకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఇందిరమ్మ కమిటీ సభ్యులు ఆనంద్, దర్జీ తదితరులు ఉన్నారు.

## శామీర్‌పేట్‌లో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ప్రారంభం

**మేడ్చల్ ప్రతినిధి, అక్టోబర్ 16, (అక్షర గళం):**

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా శామీర్ పేట్ లో సబ్ రిజిస్ట్రార్ , వివాహాముల అధికారి కార్యాలయాన్ని గురువారం ఇన్స్ స్పెక్టర్ ఆఫ్ జనరల్ రిజిస్ట్రేషన్ కమీషనర్, స్టాంపుల శాఖ రాజీవ్ గాంధీ హనుమంతు, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరిలు పాల్గొని కార్యాలయ భవనాన్ని ప్రారంభించారు. రిజిస్ట్రేషన్ , స్టాంపుల శాఖ జాయింట్ ఐటి మధుసూదన్ రెడ్డి రిబ్బిన్ కట్ చేసి కార్యాలయ భవనాన్ని ప్రారంభించారు. ఈ కార్ర్యక్రమంలో కీసర ఆర్డిఓ ఉపేందర్ రెడ్డి, శామీర్ పేట తహాసీల్దారు యాదగిరి రెడ్డి, జిల్లారిజిస్ట్రారర్ అధికారి అశోక్, తదితరులు పాల్గొన్నారు.





## జర్నలిస్టులు ఐక్యమత్యంతో ఉండి సమస్యలను పరిష్కరించుకుందాం

**టీయూడబ్ల్యూజే(ఐజేయు) మేడ్చల్ జిల్లా అధ్యక్షులు గడ్డమీది బాలరాజు గౌడ్**

**కుత్బుల్లాపూర్, అక్టోబర్ 16, (అక్షర గళం):**

జర్నలిస్టులు ఐక్యమత్యంతో ఉండి సమస్యలను పరిష్కరించు కుందామని టీయూడబ్ల్యూజే (ఐజేయు) మేడ్చల్ జిల్లా అధ్యక్షులు గడ్డమీది బాలరాజు గౌడ్ అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజక వర్గం యూనియన్ సర్వ సభ్య సమావేశం, నూతన కమిటీ ఎన్నికలు గురువారం సూరారం లోని వీఐపీ ఫంక్షన్ హాల్ లో జరిగింది.

ఈ సమావేశానికి ముఖ్య అతిధిగా హాజరైన బాలరాజు గౌడ్ మాట్లాడుతూ వర్కింగ్ జర్నలిస్టు లకు ఆరోగ్య భద్రత కోసం కార్పొరేట్ వైద్యం అందించేలా ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టుల సమస్యలను పరిష్క రించని పక్షంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. జర్న లిస్టుల పక్షపతిగా పని చేస్తున్న సంఘం మనదేనని తెలిపారు. ఈ సంఘం సభ్యులు గా ఉనందుకు గర్వపడాలని తెలిపారు. జర్నలిస్టులకు తాను ఎప్పుడు అండగా ఉంటా అన్నారు.

ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి సాయిబాబా, కోశాధికారి శేషారెడ్డి, కుత్బుల్లాపూర్ ప్రెస్ క్లబ్ మాజీ అధ్యక్షులు శేఖర్, వెంకట్, సిరిగిరి శ్రీనివాస్, నాగేంద్ర చారి, సీనియర్ జర్నలిస్టులు రామారావు, అనిల్, గౌస్, లాలయ్య తదితరులు పాల్గొన్నారు.

**కుత్బుల్లాపూర్ టీయూడబ్ల్యూజే (ఐజేయు) నూతన కమిటీ ఎన్నిక :**

టీయూడబ్ల్యూజే (ఐజేయు) కుత్బుల్లాపూర్ అధ్యక్షులుగా గోలిపల్లి దయాకర్ రెడ్డి, కార్య నిర్వాహక అధ్యక్షులు సాయిబాబా, ఉపాధ్యక్షులుగా సీతారామ రావు, కల్కి మూర్తి, శ్రీధర్, సురేష్, ప్రధాన కార్యదర్శిగా రెడ్డె బోయిన మల్లేష్ యాదవ్, కార్య నిర్వాహక కార్యదర్శులుగా బేరోజు రణ దేవ్, శేషారెడ్డి, సంయుక్త కార్యదర్శులుగా శ్రీనివాస్, ప్రవీణ్, ఎల్లం పల్లి నర్సింహులు, అన్వర్, కోశాధికారిగా శివ శర్మ, కార్యవర్గ సభ్యులుగా లక్ష్మణ్, సంతోష్,ఎండి లియాఖత్ అలీ, గ్రంధాలు, నవీన్ రాజు, సంతోష్, సలహాదారులుగా గుంటూరు శేఖర్, గౌస్ మొయినుద్దీన్, నాగేంద్ర చారీ, కె.వెంకట్, లాలయ్య, సిరిగిరి శ్రీనివాస్, కుంట అనిల్‌లని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

## డీజీపీకి శుభాకాంక్షలు తెలిపిన లక్ష్మీ నర్సింహ్మా రెడ్డి

**ఆమనగల్లు, అక్టోబర్ 16 (అక్షర గళం):**

నూతనంగా నియమితులైన తెలంగాణ రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డిని సర్పంచుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీ నర్సింహ్మా రెడ్డి గురువారం హైదరాబాద్ లోని డిజిపి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవలే పదవీ బాధ్యతలు స్వీకరించిన డీజీపీకి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా లక్ష్మీ నర్సింహ్మా రెడ్డి మాట్లాడుతూ..డీజీపీ గా పదవీ బాధ్యతలు స్వీకరించిన శివదర్ రెడ్డి సారథ్యంలో శాంతి భద్రతల పరిరక్షణ సజావుగా సాగాలని ఆయన అన్నారు. ఆయన వెంట రంగారెడ్డి జిల్లా ఎస్సీ,ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ మాజీ సభ్యుడు పత్య నాయక్, ముథోల్ మాజీ సర్పంచ్ రాజేందర్, వరికుప్పల గణేష్ తదితరులు పాల్గొన్నారు.

సర్పంచుల పెండింగు బిల్లుల విడుదలకు సిఫారసు చేయండి..

తెలంగాణ వ్యాప్తంగా ఉన్న 12769 గ్రామ



పంచాయతీలలో ఐదు సంవత్సరాల పాటు అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేసి గ్రామాలను అభి వృద్ధి చేసిన సర్పంచుల పెండింగ్ బిల్లులను ఇప్పించే విధంగా ప్రభుత్వానికి సిఫారసు చేయాలని సర్పంచుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీ నర్సింహ్మా రెడ్డి గురువారం తెలంగాణ రాష్ట్ర పోలీసు కార్యాలయంలో డీజీపీ శివధర్ రెడ్డి కి వినతిపత్రం అందజేశారు.

గ్రామాలలో సర్పంచులు అప్పులు చేసి అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారని రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 1200 కోట్ల రూపాయల బిల్లులు పెండింగులో ఉన్నాయని, బిల్లులు అందక సర్పంచులు ఆత్మహత్యలు చేసుకున్నారని డీజీపీకి వివరించినట్లు తెలిపారు. ప్రభుత్వం ఏర్పడి 20 నెలలు కావస్తున్న ఇంకా బిల్లులు చెల్లించకపోవడంతో తాజా మాజీ సర్పంచులు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారని డీజీపికి వివరించినట్లు తెలిపారు.

పెండింగు బిల్లుల విడుదలకు అనేక నిరసన కార్యక్రమాలు చేపట్టినా ప్రభుత్వం నుండి స్పందన కరువైందన్నారు. తాజా మాజీ సర్పంచుల పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేసే విధంగా ప్రభుత్వానికి సిఫారసు చేయాలని లక్ష్మీ నర్సింహ్మా రెడ్డి కోరారు.

## డీసీసీ అధ్యక్ష పదవికి గూడూరు శ్రీనివాస్ రెడ్డి దరఖాస్తు

**ఆమనగల్లు, అక్టోబర్ 16 (అక్షర గళం):**

జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్ష పదవికి కడ్తాల్ మండల కేంద్రానికి చెందిన డీసీసీ అధికార ప్రతినిధి, మాజీ ఎంపీటీసీ,



కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు గూడూరు శ్రీనివాస్ రెడ్డి దరఖాస్తు చేసుకున్నారు. గురువారం ప్రస్తుత డీసీసీ అధ్యక్షుడు, టియుఎఫ్ఐడిసి చైర్మన్ చల్లా నర్సింహా రెడ్డికి ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహా, ఆమనగల్లు మాజీ జెడ్పిటిసి శ్రీపాతి శ్రీనివాస్ రెడ్డి పలువురు పార్టీ నేతలతో కలిసి హైదరాబాద్లో దరఖాస్తును అందజేశారు. పాతికేళ్లుగా పార్టీకి అందిస్తున్న సేవలను గుర్తించి తనకు అవకాశం కల్పించాలని అభ్యర్థించారు. కాంగ్రెస్ ,యువజన కాంగ్రెస్, ఐఎన్టీయూసీలో గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు వివిధ పదవులు చేపట్టి పార్టీ బలోపేతానికి ప్రజా సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేశానని తెలిపారు. నాలుగు పర్యాయాలుగా కల్వకుర్తి నియోజకవర్గంలో ఎంపీ, ఎమ్మెల్యే ఎన్నికల్లో అభ్యర్థుల విజయం కోసం పనిచేశానని శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. పదవులు ఉన్నా లేకపోయినా నిరంతరం ప్రజల మధ్య ఉంటూ పార్టీ బలోపేతానికి కృషి చేశానని తెలిపారు. ఒకే జెండా కింద విద్యార్థి దశ నుంచి కాంగ్రెస్ పార్టీలోనే కొనసాగుతూ విధేయుడుగా పనిచేస్తున్న తనకు అవకాశం కల్పిస్తే పార్టీ ఆదేశాలకు అనుగుణంగా నడుచుకుంటానని శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. సీఎం రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, డీసీసీ అధ్యక్ష నియామక అబ్జర్వర్ ను కలిసి దరఖాస్తులను అందజేస్తానని తెలిపారు.

## బీసీల బంద్‌ను జయప్రదం చేయాలి

**ఆమనగల్లు, అక్టోబర్ 16(అక్షర గళం):**

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై హైకోర్టు స్టే ఇచ్చినందుకు నిరసనగా ఈ నెల 18న నిర్వహించే బీసీల బంద్‌లో అన్నివర్గాల ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని బీసీ సంఘం



నాయకులు పిప్పళ్ల వెంకటేష్, ఎర్రోళ్ల రాఘవేందర్ అన్నారు. గురువారం కడ్తాల్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలోని బీసీలకు 42% రిజర్వేషన్లను హైకోర్టు నిలిపివేయడం బీసీ వర్గాలపై తీవ్రమైన ద్రోహం అని పేర్కొన్నారు. రాజ్యాంగం ఇచ్చిన హక్కులను హరించే ఈ తీర్పుపై రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే అపీల్ వేసి బీసీలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.బీసీ వర్గాలు ఈ రాష్ట్ర నిర్మాణంలో, అభివృద్ధిలో, రాజకీయ, సామాజిక రంగాల్లో అగ్రగామిగా ఉన్నా సరైన గుర్తింపు ఇప్పటికీ దక్కడం లేదన్నారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో రిజర్వేషన్లను తగ్గించడం బీసీ సమాజాన్ని వెనక్కు నెట్టే కుట్ర అని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా బీసీ సంక్షేమ సంఘాల ఆధ్వర్యంలో జరుగుతున్న నిరసనలకు మద్దతుగా ఈ నెల 18వ తేదీన రాష్ట్ర బంద్‌ను విజయవంతం చేయాలని కడ్తాల్ మండలంలోని ప్రజలందరికీ పిలుపునిచ్చారు. బీసీల హక్కులను కాపాడటానికి అన్ని బీసీ సంఘాలు, ప్రజా సంఘాలు, విద్యార్థి సంస్థలు, రాజకీయ పార్టీలు ఒకేవేదికపైకి రావాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మరియు ముఖ్యమంత్రి బీసీల మనోభావాలను గౌరవించి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. అదే విధంగా బీజేపీ రాష్ట్ర నాయకులు రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన జీవో నెం.9నీ 9వ షెడ్యూల్ లో చేర్చే విధంగా కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకోరావాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. లేదంటే బీసీ వర్గాలు తీవ్ర ఆందోళనలకు దిగుతాయి అని హెచ్చరించారు.

## దైవభక్తితో మానసిక ప్రశాంతత

**- సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి**

**ఆమనగల్లు, అక్టోబర్ 16 (అక్షర గళం):**

దైవభక్తితో మానసిక ప్రశాంతత లభిస్తుందని ప్రతి ఒక్కరు ఆధ్యాత్మిక చింతన అలవర్చుకుని భక్తి మార్గం వైపు నడవాలని టాస్క్ సీఓఓ, ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి అన్నారు. గురువారం కడ్తాల్ మండలం బాలాజీ నగర్ తాండలో రామ్ దండియా దేవాలయ ప్రాంగణంలో హాథీరాం మహారాజ్ మఠం కార్యక్రమానికి మద్దతుగా ఏర్పాటు చేసిన భోగ్ కార్యక్రమంలో పాల్గొన్ని ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి మాట్లాడుతూ.. హాథీరాం మహారాజ్ ఆశీస్సులు అందరిపై ఉండాలని, దైవభక్తిని నమ్ముకున్న వారికి సుఖశాంతులు కలుగుతాయని తెలిపారు. మానసిక ప్రశాంతత భక్తీ మార్గం తోటే సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ దశరథ్ నాయక్, మాజీ సర్పంచ్లు



బిచ్యా నాయక్, నరేందర్ నాయక్, శివాజీ, రచ్చ శ్రీరాములు నాయకులు రాజు నాయక్, రెడ్య నాయక్, జైపాల్, రమేష్, రాము నాయక్, పాండు, గణేష్, బద్య మరియు ఐక్యత ఫౌండేషన్ సభ్యులు రఘు, మల్లేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



## బీ.సి. బంద్‌ను విజయవంతం చేయాలి

**బీ.ఆర్.ఎస్ సీనియర్ నాయకుడు మాజీ ఎంపీపీ సిఎల్ శ్రీనివాస్ యాదవ్**

**కల్వకుర్తి అక్టోబర్ 16 (అక్షర గళం):** స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై హైకోర్టు స్టే ఇచ్చినందుకు నిరసనగా ఈ నెల 18న నిర్వహించే బీసీ జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించే బంద్‌లో సకల జనులు పాల్గొని విజయవంతం చేయాలని తలకొండపల్లి మాజీ ఎంపీపీ సిఎల్ శ్రీనివాస్ యాదవ్ అన్నారు. తలకొండపల్లి మండల కేంద్రంలో పాత్రికేయుల సమావేశం గురువారం ఏర్పాటు చేశారు. సమావేశంలో సిఎల్ శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా బీసీ బంద్ కు అన్ని కులాల వారు అందరు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లు,బీ.సి సంఘం నాయకులు,జోలం వెంకటయ్య యాదవ్,గుండ్రాతి లింగం గౌడ్,కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

## 18న జరిగే తెలంగాణ బంద్‌కు అందరూ సహకరించాలి

**విజయవంతం చేయండి : అఖిలపక్ష పార్టీల జేఏసి పిలుపు**

**కల్వకుర్తి అక్టోబర్ 16 (అక్షర గళం):** తెలంగాణ రాష్ట్రంలో 42 శాతం బీసీ రిజర్వేషన్ల సాధన కోసం హైకోర్టు ఇచ్చిన స్టేకు నిరసనగా రాష్ట్ర బిసి జేఏసీ పులుసు మేరకు తెలంగాణ బంద్ ను విజయవంతం చేయాలని కల్వకుర్తి బీసీ సంఘాల నేతలు, వివిధ






పార్టీల నాయకులు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా తెలంగాణ జేఏసీ శిబిరం వద్ద తెలంగాణ బంద్ పోస్టర్ ని విడుదల చేశారు. తెలంగాణలో ఇప్పటికే అన్ని రాజకీయ పార్టీలు తమ సంపూర్ణ మద్దతును తెలియజేయడం జరిగింది .

అదేవిధంగా బీసీ రిజర్వేషన్లు సాధించేవరకు ఐక్యంగా అందరిని కలుపుకొని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జేఏసీ చైర్మన్ సదానంద గౌడ్,బీసీ సబ్ ప్లాన్ సాధన కమిటీ అధ్యక్షులు రాజేందర్, బహుజన మేధావి కానుగుల జంగయ్య, కల్వకుర్తి మాజీ సర్పంచ్ ఆనంద్ కుమార్, %జూ×% పరుషరాములు ,%వీ=రా% వీరస్వామి,శేఖర్, ఊరుకొండ మాజీ సర్పంచ్ శ్రీనివాసులు ఎల్లయ్య గౌడ్ , మొదలగు వారు పాల్గొన్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌దే విజయం

**- మాజీ సర్పంచ్ గోదాదేవి సత్యం**

**ఆమనగల్లు, అక్టోబర్ 16 (అక్షర గళం):**

స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులదే విజయమని మాజీ సర్పంచ్ ఎగిరిశెట్టి గోదాదేవి సత్యం అన్నారు. మండల పరిధిలోని శెట్టిపల్లి గ్రామానికీ చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు బుధవారం రాత్రి గోదాదేవి సత్యం ఆధ్వర్యంలో కాంగ్రెస్



పార్టీలో చేరారు. వారికి కండువా కప్పి పార్టీలోకి స్వాగతించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో శెట్టిపల్లి గ్రామంలో చేస్తున్న సంక్షేమ పథకాలకు, అభివృద్ధి పనులకు ఆకర్షితులై కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు తెలిపారు. త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికలకు కార్యకర్తలందరూ సిద్ధంగా ఉండాలని, గ్రామాల్లో సమన్వయంతో ముందుకు వెళ్లాలని కోరారు. దేశంలో ఎక్కడా లేని విధంగా అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డులు, సన్న బియ్యం అందించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలదని తెలిపారు.



**జూబ్లీహిల్స్ ఉపఎన్నికల నేపథ్యంలో బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి మాగంటి సునీత కి మద్దతుగా బోరబండ డివిజన్‌లోని రాజ్ నగర్, సైట్ - 1 పోలింగ్ బూత్ ఇంచార్జులైన తుంగతుర్తి నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ నాయకులతో సమావేశమైన మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్ రెడ్డి, తుంగతుర్తి మాజీ శాసనసభ్యులు డా.గాదరి కిశోర్ కుమార్. ఈ సమావేశంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు గుజ్జ యుగంధర్ రావు , నేవూరి ధర్మేందర్ రెడ్డి , మదర్ డైరీ డైరెక్టర్ రచ్చ లక్ష్మీ నర్సింహ రెడ్డి పాల్గొన్నారు.**





## యువతకు ప్రాధాన్యం ఇచ్చే ఏకైక పార్టీ కాంగ్రెస్ పార్టీ

**తిరుణవేలి మెంబర్ అఫ్ పార్లమెంట్ రాబర్ట్ బ్రూస్**

**శేరిలింగంపల్లి, అక్టోబర్ 16, (అక్షర గళం):** యువతకు ప్రాధాన్యం ఇచ్చే ఏకైక పార్టీ కాంగ్రెస్ పార్టీ అని తిరుణవేలి మెంబర్ అఫ్ పార్లమెంట్ రాబర్ట్ బ్రూస్ అన్నారు. గురువారం శేరిలింగంపల్లి నియోజకవర్గం ఇంచార్జ్ వి.జగదీశ్వర్ గౌడ్ ఆధ్వ ర్యంలో డిసిసి అధ్యక్షులు చైర్మన్ చల్లా నరసింహారెడ్డి అధ్యక్షతన హఫీజ్ పెట్ డివిజన్ పరిధిలోని హుడా కాలనీ ఎంఎస్పి కన్వెన్షన్ సెంటర్ నందు నిర్వహించిన రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుని (డీసీసీ)ఎంపికపై అభిప్రాయ సేకరణ కార్యక్రమంలో ఎఐసిసి సభ్యులు తమిళనాడు రాష్ట్రంలోని తిరుణవేలి మెంబర్ అఫ్ పార్లమెంట్ రాబర్ట్ బ్రూస్,పీసీసీ ఉపాధ్యక్షులు కోటం రెడ్డి వినయ్ రెడ్డి,యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు శివచరణ్ రెడ్డి లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంఘటన్ సృజన్ అభియాన్ సమావేశంలో కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుని (డీసీసీ) ఎంపిక ప్రక్రియ వేగం పుంజుకుందన్నారు. ఏఐసీసీ ఆదేశాల మేరకు,పీసీసీ సూచనల ప్రకారం అభిప్రాయ సేకరణ సమావేశాలు నిర్వహించాడం జరుగుతుందని తెలిపారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తూ... జిల్లాలో అందరికీ ఆమోదయోగ్యమైన నాయకత్వాన్ని ఏర్పాటు చేయాలనే ఉద్దేశంతో ఈ సమావేశాలు చురుగ్గా సాగుతున్నాయని అన్నారు. ప్రతి ఒక్క కార్యకర్త అభిప్రాయాన్ని పరిగణనలోకి తీసుకొని పార్టీ బతోపేతానికి కృషి చేస్తు వస్తున్న ఏకకై పార్టీ కాంగ్రెస్ పార్టీ అని



అన్నారు. అభిప్రాయ సేకరణ డీసీసీ అధ్యక్షుని ఎంపికలో అందరికీ ఆమోదయోగ్యమైన,పార్టీ పట్ల నిబద్ధత కలిగిన,క్రమశిక్షణతో ఉన్న నాయకుడినే ఎంపిక చేస్తామని తెలిపారు. డీసీసీ కమిటీలో కూడా యువతకు ప్రాధాన్యత ఇచ్చేందుకు కృషి చేస్తానని తెలిపారు. జిల్లా స్థాయి నుంచి గ్రామస్థాయి వరకు కాంగ్రెస్ శక్తిని పునరుద్ధరించేందుకు సమన్వయంగా పని చేయాలని తెలిపారు. పార్టీ ఐక్యతను కాపాడుతూ,శేరిలింగంపల్లి ప్రజలతో మమేకమైన నాయకత్వంతో ప్రతి కార్యకర్త ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు రాగం నాగేందర్ యాదవ్ ,ఉప్పలపాటి శ్రీకాంత్, నార్నే శ్రీనివాస్ రావు ,దొడ్ల వెంకటేష్ గౌడ్,శేరిలింగంపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ కోర్డినేటర్ రఘునందన్ రెడ్డి,టీపీసీసీ లేబర్ సెల్ గౌరవ ఉపాధ్యక్షులు నల్ల సంజీవ రెడ్డి,మాజీ కార్పొరేటర్ అశోక్ గౌడ్, శేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, శేరిలింగంపల్లి నియోజక వర్గం కార్పొరేటర్లు,కంటెస్టెడ్ కార్పొరేటర్లు,డివిజన్ అధ్యక్షులు, బ్లాక్ అధ్యక్షులు,డివిజన్ ఇన్చార్జులు,మైనారిటీ సోదరులు, మహిళా కాంగ్రెస్ అధ్యక్షులు,బ్లాక్ అధ్యక్షులు, సోదరీమణులు, యువ నాయకులు,యూత్ కాంగ్రెస్ నాయకులు, ఎన్ ఎస్ యు ఐ నాయకులు,సేవాదళ్ నాయకులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు భారీ ఎత్తున పాల్గొని వారి అభిప్రాయాన్ని తెలియజేసారు..

## జర్నలిస్టుల సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తాం...

**రైల్వే పాసులు పునరుద్ధరించాలి.**

**తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు తాటికొండ కృష్ణ.**

**కల్వకుర్తి అక్టోబర్ 16 (అక్షర గళం):**


జర్నలిస్టుల సమస్యల పట్ల నిరంతరం పోరాటం చేస్తామని, జర్నలిస్టులకు రైల్వే పాసులను ప్రభుత్వం పునరుద్ధరించాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు తాటికొండ కృష్ణ, అక్రిడిటేషన్ కమిటీ మెంబర్ పరిపూర్ణం లు అన్నారు. నాగర్ కర్నూల్ జిల్లా మహాసభల నిర్వహణపై సన్నాక సమావేశం గురువారం జిల్లా కేంద్రంలోని సహకార సంఘం కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు పాల్గొని మాట్లాడారు. జర్నలిస్టుల హక్కుల కోసం తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ పోరాటాలు చేస్తుందన్నారు. అర్హులైన జర్నలిస్టులకు ఆయా నియోజకవర్గ కేంద్రాలలో ఇండ్ల స్థలాలు కేటాయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్పొరేటు వైద్యశాలలో చెల్లుబాటు అయ్యే విధంగా హెల్త్ కార్డులు ఇవ్వాలన్నారు. అనారోగ్యంతో చనిపోయిన జర్నలిస్టుల కుటుంబాలకు రూ. 5 లక్షలు ఆర్థిక



సాయం చేసి ఆదుకోవాలని అన్నారు.. జిల్లా మహాసభల నిర్వహణ కోసం మరొకసారి జిల్లా కమిటీ సమావేశం నిర్వహించుకొని ఫైనల్ గా ఒక తేదీ అనుకొని ప్రశాంతమైన వాతావరణంలో జిల్లా మహాసభలు నిర్వహించుకునేందుకు ప్రణాళికలు. రూపొందించుకోవాలన్నారు. కల్వకుర్తి, అచ్చంపేట, కొల్లాపూర్ నాగర్ కర్నూల్ నియోజకవర్గాలలో సభ్యత్వాలు పెంచాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు రామచంద్రం, ప్రధాన కార్యదర్శి కాలూరి శీను, జాతీయ కౌన్సిల్ సభ్యులు దుమర్ల భాస్కర్, కమిటీ సభ్యులు బాలకృష్ణ, మద్దిలేటి, బాదం పరమేశ్వర్, వెంకటేష్ తదితరులు ఉన్నారు.

## రోహిణ్ రెడ్డి, సుమంత్.. గన్ పెట్టి ఎలా బెదిరిస్తారు?

- **అసలు తుపాకులు వారి దగ్గరకు ఎలా వచ్చాయి?**
- **రోహిణ్ రెడ్డి, ఫహీమ్ ఖురేషి , తిరుపతి రెడ్డి గెస్ట్ హౌజ్‌ల దగ్గర నిఘా పెట్టొచ్చుకదా?**
- **మాఫియా డాన్ లు మంత్రులయ్యారు**
- **డెక్కన్ సిమెంట్ వారిని బెదిరించిన సీఎం సన్నిహితుడు రోహిణ్ రెడ్డి, కొండా సురేఖ ఓఎస్‌డి సుమంత్‌పై ఎందుకు కేసులు నమోదు చేయలేదు ?**
- **సురేఖ కూతురు మాటల్లో ప్రభుత్వ పెద్దల చీకటి దందాలు బయట పడ్డాయి.**
- **ఉత్తమ్, రేవంత్ రెడ్డి కాల్ డేటా తీస్తే అన్ని నిజాలు బయట పడతాయి**
- **రేవంత్ ప్రభుత్వాన్ని గవర్నర్ బర్తరఫ్ చేయాలి**
- **బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆర్.ఎస్ ప్రవీణ్ కుమార్**




**హైదరాబాద్, అక్టోబర్ 16 (అక్షర గళం):**రాష్ట్రంలో పాలన అస్తవ్యస్తమైంది. నిన్న రాత్రి నుంచి హైదరాబాద్ లో హై డ్రామా నడుస్తోంది. మంత్రి నివాసం నుంచి నిందితుడిని టాస్క్ ఫోర్స్ పోలీసులు బయటకు తీసుకు రాలేక పోయారు. మాఫియా డాన్‌లు మంత్రులు అయ్యారు. ప్రజల జీవితాలతో వారు ఆడుకుంటున్నారు

.రాష్ట్రం కుక్కలు చింపిన విస్తరి గా మారింది. సామాన్యుడికో న్యాయం మంత్రులకు ఓ న్యాయమా ? మా వర్కింగ్ ప్రెసిడెంట్ కే టీ ఆర్ ఏసీబీ ఆఫీస్ నుంచి తెలంగాణ భవన్ నడుచుకుంటూ వస్తే పోలీసులు కేసు పెట్టారు.మా బీ ఆర్ ఎస్ నాయకుడు క్రిశాంక్ సోషల్ మీడియా లో పోస్టు పెడితే పది కేసులు పెట్టారు.

. మంత్రికి సంబందించిన మనిషి పై కనీసం ఎఫ్ ఐ ఆర్ కూడా నమోదు చేయలేదు. సోషల్ మీడియా లో ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్న నల్ల బాలు , గౌతమ్ తదితరులను రోజుల తరబడి జైల్లో పెట్టారు. యూరియా కోసం అడిగిన గిరిజన రైతును మిర్యాల గూడ లో రోకలి బండలు ఎక్కించారు. డెక్కన్ సిమెంట్ వారిని బెదిరించిన సీఎం సన్నిహితుడు రోహిన్ రెడ్డి , కొండా సురేఖ ఓ ఎస్ డి సుమంత్ పై ఎందుకు కేసులు నమోదు చేయలేదు? పోలీసులు కొండా సురేఖ నివాసం వద్ద ప్రేక్షకులుగా మారి పోవడం దారుణం. ఉత్తమ్ ,రేవంత్ రెడ్డి కాల్ డేటా తీస్తే అన్ని నిజాలు బయట పడతాయి సచివాలయంలో ప్రభుత్వ పరంగా జరగాల్సిన వ్యవహారాలు ప్రైవేట్ గెస్ట్ హౌజ్‌ల్లో జరుగుతున్నాయి. .రోహిన్ రెడ్డి,సుమంత్ గన్‌లు పెట్టి ఎలా బెదిరిస్తారు ? అసలు తుపాకులు వారి దగ్గరకు ఎలా వచ్చాయి? కొండా సురేఖ కూతురు మాటల్లో ప్రభుత్వ పెద్దల చీకటి దందాలు బయట పడ్డాయి. మాఫియా డాన్‌ల చేతికి రాష్ట్రం వెళ్లిందా? పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి బెదిరింపులతో ఆత్మహత్య యత్నానికి ఒడిగట్టిన బానోతు రవి ఫిర్యాదు చేసినా పోలీసులు కేసు కట్టలేదు.

కమిషన్లకోసం మంత్రులు బాహాటంగా కొట్లాడుకుంటున్నారు. అడ్లూరి లక్ష్మణ్, వివేక్, పొన్నం ప్రభాకర్, సీతక్క, పొంగులేటి లు ఒకరి మీద ఒకరు ఆరోపణలు చేసుకుంటున్నారు. తెలంగాణ భవన్ ముందట ఇంటెలిజెన్స్ పెట్టె బదులు రోహిణ్ రెడ్డి, ఫహీమ్ ఖురేషి , తిరుపతి రెడ్డి గెస్ట్ హౌజ్‌ల దగ్గర నిఘా పెట్టొచ్చుకదా? రాచకొండ కమిషనరేట్ పరిధిలో ఒక్క భూ యాజమాని సుఖంగా లేడు. ఆర్ ఆర్ టాక్స్ భాదితులు ఎక్కువయ్యారు.

గురుకులాల్లో మరణ మృదంగం కొనసాగుతున్నా ఈ ప్రభుత్వానికి పట్టింపు లేదు

..108 మంది విద్యార్థులు చనిపోయారు. మధ్యాహ్న భోజన సిబ్బందికి ,,మిషన్ భగీరథ సిబ్బందికి జీతాలు లేవు. కొన్ని చోట్ల ఉపాధ్యాయులు ,హెడ్ మాస్టర్లు పిల్లలకు భోజనం వండి పెడుతున్నారు. సీఎం అనుచరులు ఒక్కో ఏరియా ను పంచుకుని వసూళ్లు సెటిల్ మెంట్లు చేస్తున్నారు. పోలీసులు ఏం చేస్తున్నారు ?వారిని ప్రేక్షకులుగా మార్చారు. గ్యాంగుల పాలన ఎక్కువైంది .గ్యాంగులకు మంత్రులు నాయకులుగా మారారు. రాష్ట్రంలో గన్ కల్చర్ ,మాఫియా పాలన పోవాలంటే రేవంత్ ప్రభుత్వాన్ని గవర్నర్ బర్తరఫ్ చేయాలి.

జూబిలీ హిల్స్ లో బీ ఆర్ ఎస్ గెలవకపోతే మాఫియా పాలన పెరిగిపోతుంది. ఈ రోజు కేబినెట్ సమావేశంలో మంత్రులు మూకుమ్మడిగా రాజీనామా చేసి తమకు పాలన చేతకావడం లేదని తప్పుకోవాలి. మాఫియా కేబినెట్ సంస్కృతి కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన నుంచే మొదలైంది

**సుప్రీంకోర్టు తీర్పు రేవంత్ రెడ్డికి చెంపపెట్టు : దూదిమెట్ల బాలారాజు యాదవ్...**


బీసీ రిజర్వేషన్లపై సుప్రీంకోర్టు తీర్పు రేవంత్ రెడ్డికి చెంప పెట్టు. బీసీలకు రిజర్వేషన్లు రావాలంటే చట్టప్రకారం ముందుకు వెళ్ళాలి. బీసీలను రేవంత్ రెడ్డి ప్రభుత్వం మోసం చేస్తోంది. ఠాగూర్ సినిమాను తలపించే విధంగా బీసీ రిజర్వేషన్లపై కాంగ్రెస్ వ్యవహారం ఉంది..బీసీలను ఎన్నిసార్లు మోసం చేస్తారు? మీరు కుర్చీ ఎక్కడానికి బీసీలు ఉపయోగపడ్డారు. సర్వే తప్పులతడక ఉందని కాంగ్రెస్ ఎమ్మెల్సీ ఆరోపించారు.బీసీ బిల్లులను రాష్ట్రపతి వద్ద పెండింగ్ లో ఉండటంతో ఆర్డినెన్స్ తెచ్చారు. ఆర్డినెన్స్ ను గవర్నర్ ఆమోదించకపోవడంతో జీఓ నంబర్ 9 తెచ్చారు. ఢిల్లీకి వెళ్లి కాంగ్రెస్ నేతలు హడావిడి చేశారు. బీసీ రిజర్వేషన్ల కోసం పార్లమెంటులో చట్టం చేస్తే బిఆర్ఎస్ సపోర్టు చేస్తుందని కేటిఆర్ చెప్పారు. కాంగ్రెస్ పార్టీని బీసీలు బొంద పెట్టడం ఖాయం.ప్రెస్‌మీట్‌లో కార్పొరేషన్ మాజీ చైర్మన్లు పల్లె రవికుమార్ ,రామచంద్రు నాయక్, బీ ఆర్ ఎస్ నేతలు కల్వకుర్తి శ్రీనివాస్ యాదవ్ , బద్రుద్దీన్ పాల్గొన్నారు.

## కారు గుర్తుకు ఓటు వేద్దాం

**- మాగంటి సునీత గోపినాథ్‌ని భారీ మెజారిటీతో గెలిపిద్దాం..**

**బిఆర్ఎస్ పార్టీ నిజామాబాద్ జిల్లా అధ్యక్షులు, ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్ రెడ్డి**

**హైదరాబాద్, అక్టోబర్ 16 (అక్షర గళం):**జూబ్లీహిల్స్ ఉపఎన్నికల సందర్భంగా బి.ఆర్.ఎస్ పార్టీ అభ్యర్థి మాగంటి సునీత గోపినాథ్ కి మద్దతుగా షేక్ పేట్ డివిజన్ పరిధిలోని అఖింషా కాలని, మినీ బృందావన్ కాలనీలో ఇంటి ఇంటి ప్రచారంలో బిఆర్ఎస్ పార్టీ నిజామాబాద్ జిల్లా అధ్యక్షులు ఆశన్నగారి జీవన్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు హైదరాబాద్ నగర అభివృద్ధికి



కేసీఆర్ చేసిన కృషిని ఓటర్లకు గుర్తు చేశారు. బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి మాగంటి సునీత గోపినాథ్‌ని భారీ మెజార్టీతో గెలిపించి, జూబ్లీహిల్స్‌లో అభివృద్ధి పరంపర కొనసాగించాలన్నారు.

అనంతరం గడిచిన రెండు సంవత్సరాల కాలంలో వివిధ పథకాల ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వం, రేవంత్ రెడ్డి ప్రజలకు బాకీపడ్డ డబ్బుల వివరాలు తెలియజేస్తూ కాంగ్రెస్ బాకీ కార్డులను ప్రజలకు పంపిణీ చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు వాహిద్, కొండా శ్రీధర్ రెడ్డి,షకీల్ అహ్మద్, అకీల్ అహ్మద్, ఖాలీక్ అహ్మద్,అమర్ అహ్మద్, సోయల్ హాలీ, శ్రీధర్ చారి, భాస్కర్ నేత,శ్రీనివాస్, శ్రీకాంత్,రాజు,ఇమ్రాన్ ఖురేషి, మహమ్మద్ ఖలీల్,సంతోష్, గోపు రంజిత్,కిరణ్, పృథ్వి, శ్రీకర్, సైఫ్ తదితరులు నాయకులు పాల్గొన్నారు.




# 21వ శతాబ్దం నరేంద్ర మోదీదే..

- మోదీ విజయం భారత్ విజయం... అదే మన విజయం
- కేంద్ర సహకారంతో రాష్ట్రానికి అత్యధిక పెట్టుబడులు
- జీఎస్టీ 2.0తో ప్రజలకు పొదుపూ-భరోసా
- త్వరలో రాయలసీమకు హైకోర్టు బెంచ్
- సూపర్ జీఎస్టీ- సూపర్ సేవింగ్స్ బహిరంగ సభలో సీఎం చంద్రబాబు
- బీహార్‌లో ఎన్డీఏ విజయం సాధిస్తుందని విశ్వాసం వ్యక్తం చేసిన సీఎం
- ప్రధాని మోదీతో కలిసి శ్రీశైల మహాక్షేత్రాన్ని దర్శించుకున్న ముఖ్యమంత్రి
- రూ.13,429 కోట్ల విలువైన ప్రాజెక్టులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేసిన ప్రధాని మోదీ



**కర్నూలు:** కేంద్రంలో రాష్ట్రంలోని ఎన్డీఏ డబుల్ ఇంజన్ సర్కార్ తో ఆంధ్రప్రదేశ్‌కు రెట్టింపు ప్రయోజనాలు దక్కుతున్నాయని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. ప్రధాని మోదీ సహకారంతో రాష్ట్రానికి అత్యధిక పెట్టుబడులు వస్తున్నాయని సీఎం అన్నారు.

గురువారం కర్నూలులో ఏర్పాటు చేసిన సూపర్ జీఎస్టీ – సూపర్ సేవింగ్స్, బచత్ ఉత్సవ్ బహిరంగ సభలో సీఎం ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. జీఎస్టీ 2.0 సంస్కరణలతో దేశ ప్రగతి వేగాన్ని పెంచటంలో ప్రధాని మోదీ కీలక నిర్ణయం తీసుకున్నారని సీఎం ప్రశంసించారు. ముఖ్యమంత్రిగా.. ప్రధానిగా 25 ఏళ్ల ప్రజాసేవ ప్రస్థానాన్ని పూర్తి చేసుకున్న ప్రధాని మోదీకి ముఖ్యమంత్రి శుభాకాంక్షలు తెలియచేశారు. అత్యంత అంకిత భావంతో దేశానికి సేవలు అందిస్తున్న మోదీ ఓ విశిష్టనేత అని కొనియాడారు.

సరైన సమయంలో సరైన చోట సరైన నేతగా ప్రధాని స్థానంలో మోదీ ఉన్నారని.. ఆయన 21వ శతాబ్దపు నేత అని సీఎం వ్యాఖ్యానించారు. ఎలాంటి విరామం లేకుండా ప్రజల సేవలోనే ఆయన అంకితమై ఉన్నారని.. తాను చూసిన ప్రధానుల్లో మోదీ అత్యంత ప్రగతిశీల నేత అని అన్నారు. దేశ అభివృద్ధి కోసం ఆయన కీలకమైన సంస్కరణలు తీసుకువచ్చారని తద్వారా ప్రపంచవ్యాప్తంగా భారత్ అగ్రస్థానానికి చేరుకుంటోందని అన్నారు.

11 ఏళ్ల క్రితం 11వ స్థానంలో ఉన్న భారతదేశం ప్రధాని మోదీ సంకల్పంతో ఇప్పుడు 4వ స్థానానికి చేరిందని... వికసిత్ భారత్ లక్ష్యంలో భాగంగా 2047కు దేశం సూపర్ పవర్ గా మారుతుందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఆపరేషన్ సింధూర్ ద్వారా సైనిక పరంగా భారతదేశ సత్తాను ప్రపంచానికి చాటేలా చేశారని ముఖ్యమంత్రి అన్నారు.

### జీఎస్టీ సంస్కరణలతో ప్రజలందరికీ లాభమే

ఒకే దేశం – ఒకే పన్ను – ఒకే మార్కెట్ నినాదంతో వచ్చిన జీఎస్టీ పన్ను విధానంలో ప్రస్తుత సంస్కరణల వల్ల 99 శాతం వస్తువులు సున్నా నుంచి 5 శాతం పన్ను పరిధిలోకి వచ్చాయని.. తద్వారా అన్ని వస్తువుల ధరలు తగ్గాయని సీఎం అన్నారు. జీఎస్టీ 2.0తో పన్నులు తగ్గి పేదలు, మధ్యతరగతికి గణనీయంగా ఉపశమనం కలిగిందని అటు వ్యాపారులు, ఎంఎస్ఎంఈ వర్గాలకూ ప్రయోజనం చేకూరుతోందని స్పష్టం చేశారు. విద్యార్థులు, రైతులు, చిరుద్యోగులు, చిరు వ్యాపారులు, వృద్ధులు, కూలీలు, కార్మికులు ఇలా అన్ని వర్గాలకు లబ్ది కలిగించేలా సంస్కరణలు ఉన్నాయని సీఎం పేర్కొన్నారు. జీఎస్టీ తగ్గింపుతో ప్రతీ కుటుంబానికీ రూ.15 వేల వరకూ ఆదా అవుతుందని స్పష్టం చేశారు. దసరా నుంచి దీపావళి వరకూ జీఎస్టీ సంస్కరణల్ని పండుగలా నిర్వహిస్తున్నామని వెల్లడించారు. రాష్ట్రంలో ఇప్పటి వరకూ 98 వేల ఈవెంట్లు నిర్వహించి అవగాహన కల్పిస్తున్నట్టు వివరించారు. జీఎస్టీ బచత్ ఉత్సవ్ కాస్తా ఇవాళ భరోసా ఉత్సవ్ గా మారిందని చంద్రబాబు అన్నారు. డబుల్ ఇంజన్ సర్కార్ తో రాష్ట్రానికి డబుల్ ప్రయోజనాలు కలుగుతున్నాయని సీఎం అభిప్రాయం వ్యక్తం చేశారు. సూపర్ సిక్స్ పథకాలు, సూపర్ జీఎస్టీతో ప్రజలకు సూపర్ గా పొదుపు జరిగిందని సీఎం అన్నారు.

### స్వదేశీ మంత్రమే బ్రహ్మాస్త్రం

ప్రపంచ మార్కెట్లను ప్రభావితం చేస్తున్న టారిఫ్ లను ఎదుర్కొనేందుకు ప్రధాని మోదీ ఇచ్చిన స్వదేశీ పిలుపే తారకమంత్రం అవుతుందని సీఎం అన్నారు. ఈ స్వదేశీ పిలుపును అందిపుచ్చుకుని సెమీ కండక్టర్ల నుంచి శాటిలైట్ల వరకూ చిప్ ల నుంచి షిప్పుల వరకూ ఏపీలోనే ఉత్పత్తి చేసేలా కార్యాచరణ చేపట్టామని అన్నారు. సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా మెగా డీఎస్సీ, పీఎం కిసాన్–అన్నదాత సుఖీభవ, స్త్రీశక్తి, తల్లికి వందనం, దీపం–2.0, పెన్షన్ల పంపిణీ, వంటి సంక్షేమ పథకాలను కేంద్ర సహకారంతోనే సూపర్ హిట్ చేశామని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు.

రాష్ట్రానికి 16 నెలలుగా ప్రధాని మోదీ అందిస్తున్న సాయాన్ని మరువలేం అన్నారు. కేంద్రం సహకారంతో అమరావతిని నిలబెట్టామని, పోలవరాన్ని గాడిన పెట్టామని, విశాఖ ఉక్కును బలోపేతం చేశామన్నారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ అత్యధిక పెట్టుబడులు సాధిస్తోందని విశాఖలో ఆర్సెల్లార్ మిట్టల్, 15 బిలియన్ డాలర్ల పెట్టుబడితో గూగుల్ ఏఐ డేటా హబ్ వస్తోందని, నెల్లూరులో భారత్ పెట్రోలియం కార్పోరేషన్ రిఫైనరీ వస్తోందని ముఖ్యమంత్రి అన్నారు.

రాయలసీమకు త్వరలో హైకోర్టు బెంచ్ రాబోతోందని సీఎం చెప్పారు. రాయలసీమలో స్టీల్, స్పేస్, డిఫెన్స్, ఏరో స్పేస్, ఆటోమొబైల్, ఎలక్ట్రానిక్స్, డ్రోన్స్ తయారీ, గ్రీన్ ఎనర్జీ, ఫుడ్ ప్రాసెసింగ్, సిమెంట్ పరిశ్రమలు వస్తున్నాయన్నారు. వీటితో పాటు సెమీ కండక్టర్ యూనిట్, క్వాంటం వ్యాలీ రావడానికి కారణమైన ప్రధానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియచేస్తున్నట్టు సీఎం వ్యాఖ్యానించారు.

### ఏపీలో రూ.13,429 కోట్ల కేంద్ర ప్రాజెక్టులు

రాష్ట్రంలో విద్యుత్, రైల్వే, జాతీయ రహదారులు, పారిశ్రామిక, రక్షణ రంగాలకు చెందిన రూ. 13,429 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు ప్రధాని శ్రీకారం చుట్టారు. వర్చువల్ విధానం ద్వారా వివిధ ప్రాజెక్టులను మోదీ ప్రారంభించారు. అలాగే ఇంకొన్నింటిని శంకుస్థాపనలు చేశారు. మరో రెండు ప్రాజెక్టులను జాతికి అంకితం చేశారు. రూ.9,449 కోట్ల విలువైన 5 అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. రూ.1704 కోట్ల విలువైన 8 అభివృద్ధి పనులను ప్రధాన మంత్రి ప్రారంభించారు. ఇక రూ.2276 కోట్ల విలువైన 2 ప్రాజెక్టులను ప్రధాని జాతికి అంకితం చేశారు.

**శంకుస్థాపనలు:** విద్యుత్ ట్రాన్స్ మిషన్ వ్యవస్థ – రూ. 2886 కోట్లు, ఓర్వకల్లు–కొప్పర్తి పారిశ్రామిక కారిడార్ – రూ. 4922 కోట్లు, కొత్త వలస – విజయనగరం మధ్య 4వ లైన్ – రూ. 493 కోట్లు, పెందుర్తి – సింహాచలం నార్త్ మధ్య రైల్ ఫ్లైఓవర్ లైన్ – రూ. 184 కోట్లు, సబ్బవరం–షీలానగర్ జాతీయ రహదారి – రూ. 964 కోట్లు. ప్రారంభోత్సవాలు: రేణిగుంట – కడప – మదనపల్లె రోడ్డు – రూ. 82 కోట్లు, కడప – నెల్లూరు – చునియంపల్లి రోడ్డు – రూ. 286 కోట్లు, కనిగిరి బైపాస్ రోడ్ – రూ. 70 కోట్లు, గుడివాడ–నూజెండ్ల వద్ద 4లేన్ల రోడ్డు ఓవర్ బ్రిడ్జి – రూ. 98 కోట్లు, కల్యాణదుర్గం – రాయదుర్గం – మొలకలమూరు రోడ్డు – రూ. 13 కోట్లు, పీలేరు – కలసూర్ నాలుగు లేన్ల రోడ్ – రూ. 593 కోట్లు, నిమ్మకూరులోని BELలో అడ్వాన్స్‌డ్ నైట్ విజన్ గ్లాసుల ఉత్పత్తి కేంద్రం – రూ. 362 కోట్లు, చిత్తూరులోని ఇండేన్ బాట్లింగ్ ప్లాంట్ – రూ. 200 కోట్లు. జాతికి అంకితం:

కొత్తవలస –కొరాపుట్ రైల్వే డబ్లింగ్ పనులు– రూ. 546 కోట్లు, శ్రీకాకుళం– అంగుల్ నాచురల్ గ్యాస్ పైప్‌లైన్ – రూ.1730 కోట్లు.

# సహజ సిద్ధమైన పకృతి చూపెట్టేలా వీడియోలు చేయాలి

**- మంత్రి వాకిటి శ్రీహరి**



**హైదరాబాద్:** ప్రపంచంలో ఉన్న పర్యాటక ప్రాంతాలను తలదన్నే పర్యాటక ప్రాంతాలు తెలంగాణలో ఉన్నాయి. వారంలో 6 రోజులు పని చేసిన ఒక్క రోజు అయినా పకృతిని మనం ఆస్వాదించాలి. పర్యాటక ప్రాంతాలు అభివృద్ధి చేసేలా ప్రభుత్వం కార్యక్రమాలు తీసుకుంటుంది.

కొన్ని దేశాల ఆర్థిక వ్యవస్థ పర్యాటక రంగంపై ఆధారపడి ఉన్నాయి. మన దగ్గర సహజ సిద్ధమైన పర్యాటక ప్రాంతాలు ఉన్నా చూపెట్టలేని పరిస్థితిలో ఉన్నాం. మా ప్రభుత్వం పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేసే ప్రయత్నం చేస్తుంది. పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేయటంలో భాగంగా ఈ రోజు ఉస్మానియా యూనివర్సిటీ ఈ సెమినార్ నిర్వహించారు.

యువత తల్చుకుంటే ఏదైనా సాధ్యం అవుతుంది. రీల్స్ చేసే బదులు మన దగ్గర ఉన్న సహజ సిద్ధమైన పకృతి చూపెట్టేలా వీడియోలు చేయాలి. 33 జిల్లాల నుండి వచ్చిన విద్యార్థులు ఇక్కడ ఉన్నారు. వారి తలుచుకుంటే మారుమూల ప్రాంతాల్లో ఉన్న పర్యాటకాన్ని మన వెలుగులోకి తీసుకొని రావచ్చు.

## ఆర్ అండ్ బి శాఖ పరిధిలో నిర్మించే
# హ్యామ్ రోడ్లకు రాష్ట్ర కేబినెట్ ఆమోదం

- హర్షం వ్యక్తం చేసిన మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి
- వారంలో టెండర్ ప్రక్రియ ప్రారంభిస్తాం
- వచ్చే 30నెలల్లో రాష్ట్రంలో అద్దం లాంటి రోడ్లు నిర్మిస్తాం
- దేశానికే రోల్ మోడల్ గా నిలువనున్న తెలంగాణ రోడ్లు
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,సహచర మంత్రి వర్గానికి కృతజ్ఞతలు
- రాష్ట్ర రోడ్లు భవనాలు శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి



**హైదరాబాద్:** గురువారం డా.బి.ఆర్ అంబేద్కర్ రాష్ట్ర సెక్రటేరియట్ లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన కేబినెట్ సమావేశంలో ఆర్ అండ్ బి శాఖ పరిదిలో 10,547 కోట్ల వ్యయంతో నిర్మించే 5,566 కి.మీ రోడ్లకు రాష్ట్ర మంత్రి వర్గం ఆమోదం తెలిపిందనీ రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు.

### ఇందులో విస్తరించబడే రోడ్లు మొత్తం-1,791 కి.మీ

వ్యయం – 6,152 కోట్లు..
సింగిల్ లేన్ నుండి డబుల్ లేన్ –866 కి.మీ – 2,377 కోట్లు,
డబుల్ లేన్ 10మీటర్ల రోడ్డు – 779 కి.మీ – 2,637 కోట్లు,4లేన్ రోడ్లు – 124 కి.మీ – 735 కోట్లు అని మంత్రి పేర్కొన్నారు.

### బలోపేతం చేసే రోడ్లు మొత్తం – 3,775 కి.మీ

వ్యయం – 4,395 కోట్లు,
సింగిల్ లేన్ –768 కి.మీ – 674 కోట్లు,
డబుల్ లేన్ – 2,618 కి.మీ – 3031 కోట్లు,
డబుల్ లేన్(10 మీటర్ల రోడ్డు) – 148 కి.మీ – 225 కోట్లు..4లేన్ – 221 కి.మీ 444 కోట్లు అని మంత్రి వెల్లడించారు.

ఆర్ అండ్ బి సర్కిళ్ల వారిగా మొత్తం 32 ప్యాకేజీల్లో పనులు చేపట్టనున్నట్లు,అందులో మొదటి ఫేజ్ లో 10 ప్యాకేజీలు వెంటనే పనులు ప్రారంభించేలా చర్యలు చేపట్టనునట్లు చెప్పారు. వారం రోజుల్లో టెండర్ ప్రక్రియ ప్రారంభమవుతుందని, వచ్చే 30నెలల్లో ప్యాకేజీల వారిగా అన్ని రోడ్లు పూర్తి చేస్తామని మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి స్పష్టం చేశారు.

# జీఎస్టీ 2.0.. సామాన్య ప్రజలకు ఊరటనిచ్చే సంస్కరణ

- ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నిర్ణయంతో ప్రతి కుటుంబానికి ఏడాదికి రూ.20 వేల ప్రయోజనం
- ఆత్మ నిర్భర భారత్ తో దేశాన్ని ప్రపంచ పటంలో నిలిపిన నాయకుడు మోదీ
- పెట్టుబడులు రావాలంటే ప్రభుత్వాలపై నమ్మకం ఉండాలి
- కూటమి ఆధ్వర్యంలో 15 ఏళ్లపాటు స్థిరమైన ప్రభుత్వం కొనసాగాలి
- సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ సభలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్

**కర్నూలు:** 'దేశంలో పన్నుల భారం పెరగడమే తప్ప ఎప్పుడూ తగ్గిన దాఖలాలు ఉండవు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తీసుకువచ్చిన జీఎస్టీ 2.0 సంస్కరణతో పేదలు, సామాన్యులకు పెద్ద ఎత్తున ప్రయోజనం కలుగుతుంది. విద్యా, వైద్యం ఖర్చుల భారం నుంచి ప్రజలకు ఊరట లభిస్తుంద'ని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. జీఎస్టీ 2.0తో ప్రతి కుటుంబానికి ఏడాదికి రూ. 20 వేల వరకు ఆదా అవుతుందన్నారు. ఆత్మ నిర్భర భారత్ ద్వారా ప్రపంచ పటంలో దేశాన్ని నిలబెట్టిన మోదీ కృషితో దేశంలో, రాష్ట్రంలో పెట్టుబడులు వెల్లు వెల్లువెత్తుతున్నాయన్నారు.

గూగుల్ లాంటి అతిపెద్ద ప్రాజెక్టులు ఆంధ్రప్రదేశ్ కి వచ్చాయని తెలిపారు. ఎలాంటి ఫలితం ఆశించకుండా దేశ సేవే పరమావధిగా పని చేస్తున్న కర్మ యోగి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అని అభివర్ణించారు. కర్నూలు నగర శివారు నన్నూరు వద్ద నిర్వహించిన సూపర్ జీఎస్టీ – సూపర్ సేవింగ్స్ పేరిట నిర్వహించిన బహిరంగ సభలో ప్రధాని శ్రీ నరేంద్ర మోదీ గారు, రాష్ట్ర గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, కేంద్ర, రాష్ట్ర మంత్రులతో కలిసి ఉప ముఖ్యమంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సభకు హాజరైన అశేష జనవాహినిని ఉద్దేశించి పవన్ కల్యాణ్ మాట్లాడుతూ... "ధర్మాన్ని పట్టుకుని ముందుకు వెళ్తున్న నరేంద్ర మోదీ లాంటి వ్యక్తి ప్రధానిగా ఉండడం మన అదృష్టం. మోదీ దేశాన్ని మాత్రమే కాదు.. రెండు తరాలను ముందుకు నడుపుతున్నారు. భావి తరానికి మార్గదర్శనం చేస్తున్నారు. దేశం తలెత్తుకొనేలా ఆత్మ నిర్భర్ భారత్ తీసుకువచ్చారు. మేం సేవకులం మాత్రమే కాదు అవసరం అయితే ప్రపంచానికి దిశానిర్దేశం చేస్తామని చాటి చెప్పారు. భారత్ అగ్రగామి.. ఎవరికీ భయపడే దేశం కాదని చేతల ద్వారా తెలియ చెప్పారు.

### ప్రజల ఆకాంక్షలను ముందుకు తీసుకువెళ్తాం...

ఒక దేశపు జెండా ఎలా పౌరుషంగా ఉంటుందో.. అలాగే మన దేశాన్ని ప్రపంచ పటంలో నిలబెట్టిన మోదీ ఈ రోజున మన రాష్ట్రానికి విచ్చేసి రూ. 13 వేల కోట్లకు పైగా అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం



చుట్టారు. ఒక్క ఓర్వకల్లు పారిశ్రామికవాడలోనే రూ. 4 వేల కోట్ల పెట్టుబడులు వస్తున్నాయి.

పెట్టుబడులు రావాలి అంటే ప్రభుత్వాలపై నమ్మకం ఉండాలి. కూటమి ప్రభుత్వం కనీసం 15 ఏళ్ల పాటు అధి కారంలో ఉండాలి. పెట్టుబడులు పరిశ్రమల నమ్మకాన్ని సడలించకుండా అంతా కలిసి ఉండి స్థిరమైన ప్రభుత్వాన్ని కొనసాగిస్తాం. గౌరవ ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ గారి మార్గదర్శకత్వంలో, ముఖ్యమంత్రి శ్రీ చంద్రబాబు నాయుడు గారి నాయకత్వంలో ప్రజల ఆకాంక్షలను ముందుకు తీసుకువెళ్తామని తెలియజేస్తున్నాను" అన్నారు.

### మోదీకి సత్కారం

అంతకు ముందు సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ సభ వేదికపై ప్రధాన మంత్రి నరేంద్ర మోదీని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, పవన్ కల్యాణ్ సత్కరించారు. మహాశివుని ప్రతిమను బహూకరించారు.

# 42 శాతం రిజర్వేషన్ ఇచ్చాకనే ఎన్నికలు

- చట్ట పరంగా, షెడ్యూల్ 9 ప్రకారం ఎన్నికలకు పోవాలి
- ముఖ్యమంత్రి ఇష్టం వచ్చినట్లు వ్యవహరిస్తే తీవ్ర పరిమాణాలు
- రిజర్వేషన్ పోరాటంలో రాజీ లేదు
- 18న జరిగే ఆందోళనకు బీఆర్ఎస్ మద్దతు
- మాజీ మంత్రి తలసాని శ్రీనివాసయాదవ్
- తెలంగాణభవన్‌లో బీసీ నేతల భేటీ
- మాజీ మంత్రులు గంగుల,తలసాని, శ్రీనివాస్ గౌడ్, ఎంపీ వద్దిరాజు తదితర బీసీ నాయకులతో కలిసి సమావేశం




**హైదరాబాద్:** మాజీ మంత్రి,సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అధ్యక్షతన తెలంగాణ భవన్ లో గురువారం మధ్యాహ్నం బీసీ ముఖ్య నాయకులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తలసాని ఏమన్నా రంటే.. తెలంగాణ భవన్ నుంచే వెళ్లి బీసీ బంద్‌లో పాల్గొంటాం. కాంగ్రెస్ డ్రామా చేయడానికి చూసింది. మేము అసెంబ్లీ లోనే చెప్పినం. ప్రభుత్వంపై వ్యతిరేకత ఉంది. కులగణన సరిగా జరగలేదు. కులగణన సర్వే పత్రం పై ముఖ్యమంత్రి ఉప ముఖ్యమంత్రి ఫోటో పెట్టడం తప్పు.

గవర్నర్‌కి తీర్మానం వెళ్ళక ముందే ఢిల్లీలో ధర్నా చేశారు.మల్లిఖార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ కూడాధర్నాకు రాలే. ఢిల్లీకి వెళ్లి ఎంజాయ్ చేసి వచ్చారు. కేబినెట్‌లో పార్టీల పరంగా ఎన్నికల కి వెళ్తాము అంటే మేము ఒప్పుకోము.42 శాతం రిజర్వేషన్ ఇచ్చాకనే ఎన్నికకి పోవాలి. చట్ట పరంగా, షెడ్యూల్ 9 ప్రకారం ఎన్నికలకు పోవాలి. ముఖ్యమంత్రి ఇష్టం వచ్చినట్లు వ్యవ హరిస్తే తీవ్ర పరిమాణాలు ఉంటాయి.అందరూ బంద్‌కి సహకరించాలి. బంద్ లో ప్రతి బీసీ పాల్గొనాలి..

మాజీ మంత్రి వి.శ్రీనివాస్ గౌడ్ ఏమన్నారంటే... కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు చేసేవరకు వారి వెంట పడుతూనే ఉంటాం. 17 నెలల నుంచి కాంగ్రెస్ నిద్ర పోయింది. ఢిల్లీలో జరిగిన ధర్నాకి రాహుల్ గాంధీ ఎందుకు రాలేదో కాంగ్రెస్ వాళ్లు చెప్పాలి. చట్టమే లేనిది ఏ జడ్జి తీర్పు ఇస్తారు? అందరూ ఈ నెల 18 న బంద్ కు సహకరించాలి.

సమావేశానికి బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్, మాజీ మంత్రి వీ.శ్రీనివాస్ గౌడ్, ఎమ్మెల్యేలు కాలేరు వెంకటేష్, ముఠా గోపాల్, ఎమ్మెల్సీ డాక్టర్ దాసోజు శ్రవణ్ కుమార్, మాజీ ఎమ్మెల్యేలు దాస్యం వినయ్ భాస్కర్,పుట్టా మధుకర్, కోరుకంటి చందర్, కరీంనగర్ జడ్పీ మాజీ ఛైర్మన్ తుల ఉమ,నాయకులు శుభప్రద్ పటేల్,ఉపేంద్రాచారి, గడ్డం శ్రీనివాస్ యాదవ్ తదితరులు హాజరయ్యారు. స్థానిక సంస్థలు, విద్యా, ఉద్యోగ రంగాలలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు సాధించే విషయమై సమావేశంలో చర్చించారు. ఈనెల 18వతేదీన జరుప తలపెట్టిన రాష్ట్ర బంద్ లో పాల్గొని విజయవంతం చేయాలని సమావేశం నిర్ణయించింది.

# గ్రేటర్ హైదరాబాద్‌లో ట్రాన్స్‌ఫార్మర్‌ల ఏర్పాటులో నూతన పద్ధతి

**హైదరాబాద్:** నగరంలో విద్యుత్ పంపిణీ వ్యవస్థను ఆధునీకరించేందుకు దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ) కొత్త చర్యలు చేపట్టింది. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఇచ్చిన సూచనల మేరకు, అధికారులు నగరంలోని ట్రాన్స్‌ఫార్మర్‌ల అమరిక విధానంలో వినూత్న మార్పులు చేశారు.

ఇప్పటి వరకు, ఎక్కువగా డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్‌లు రహదారుల పక్కన నేలమట్టానికి సమీపంగా అమర్చబడి ఉండేవి. ఈ పద్ధతి వల్ల పాదచారులకు అసౌకర్యం కలగడంతో పాటు మరియు ట్రాన్స్‌ఫార్మర్ చుట్టుపక్కల చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాల వలన ప్రమాదకర పరిస్థితులు తలెత్తుతున్నాయి. కొన్నిసార్లు షార్ట్ సర్క్యూట్‌లు, విద్యుత్ లీకేజీలు కూడా చోటుచేసుకుని ప్రమాదాలు సంభవించాయి.

ఈ సమస్యలను పరిష్కరించేందుకు, దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ లో పోల్ మౌంటెడ్ డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్ ఒక కొత్త సాంకేతిక పద్ధతిని ప్రవేశపెట్టారు. ఈ నూతన పద్ధతిలో, విద్యుత్ స్తంభానికి దాదాపు 10 అడుగుల ఎత్తులో ఇనుప స్ట్రక్చర్ ఏర్పాటు చేసి, దాని మీద ట్రాన్స్‌ఫార్మర్‌ను అమర్చుతారు. ఈ విధానం వల్ల ట్రాన్స్‌ఫార్మర్ నేలమట్టానికి దూరంగా ఉండి, పాదచారుల రాకపోకలకు ఎలాంటి ఆటంకం కలగదు. అదేవిధంగా, ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ చెత్త లేదా ఇతర వ్యర్థ పదార్థాలు చేరకుండా ఉండడం వలన భద్రతా ప్రమాణాలు గణనీయంగా మెరుగుపడతాయి. అంతేకాక, ఈ విధానం ట్రాన్స్‌ఫార్మర్ స్ట్రక్చర్ ఖర్చును కూడా తగ్గిస్తుంది, ఎందుకంటే పెద్ద స్థాయి కాంక్రీట్ ఫౌండేషన్ అవసరం ఉండదు. అంబర్ పెట్ పోలీస్ లైన్‌లో ఏర్పాటు చేసిన పోల్ మౌంటెడ్ డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్ నమూనాను సంస్థ





చైర్మన్ & మేనేజింగ్ డైరెక్టర్ ముషారఫ్ ఫరూఖీ, ఐఏఎస్ పరిశీలించి తగు సూచనలు చేసారు. నూతనంగా ఏర్పాటు చేసే ట్రాన్స్ ఫార్మర్ లకు ఈ పద్ధతినే వాడాలని సూచించారు. ఈ పర్యటనలో డైరెక్టర్ డా.నరసింహులు, చీఫ్ ఇంజినీర్ మెట్రో ప్రభాకర్, సూపరింటెండింగ్ ఇంజినీర్ వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# సంపాదకీయం..

## తాయిలాలకు లొంగితే అంతే సంగతులు!

ఎన్నికల ముందు హామీలు ఇచ్చే వారిని ప్రజలు నమ్మడం మానేస్తే ప్రజాస్వామ్యం బోలపేతం అవుతుంది. అంతెందుకు అసలు నాయకుల హామీలను పట్టించుకోవద్దు. ప్రజలు ఈ విషయంలో చైతన్యం పొందాలి. ఉచిత పథకాలు, నగదు బదిలీల హామీలను దరిచేరకుండా చూసుకోవాలి. రాజకీయ నాయకులు హామీలు ఇవ్వడం కాదు..ప్రజలు తమ ఎజెండాను నాయకుల ముందు ఉంచాలి. గ్రామాల వారీగా ప్రజలే ఎజెండా విధించాలి. రోడ్లు వేస్తారా లేదా అడగాలి. మంచినీటి సరఫరా చేస్తారా లేదా నిలదీయాలి. ఇలాంటి సమస్యల ను ఏ గ్రామానికి ఆ గ్రామ ప్రజలే గుర్తించి నాయకులకు ఎజెండా నిర్దేశించాలి. కిలోరూపాయి బియ్యం, పెన్షన్లు, ఇందిరమ్మ ఇళ్లు



వంటి వాటికి లొంగితే అంతే సంగతులు. అలా చేసి అధికారంలోకి వచ్చిన నేతలు రాష్ట్రాలను లూటీ చేసేస్తున్నారు.అందుకు తెలుగు రాష్ట్రాలు పక్కా ఉదాహరణ అని చెప్పవచ్చు. బీహార్‌లో పదేళ్లుగా అటుఇటుగా ఎన్‌డిఎ ప్రభుత్వమే నడుస్తోంది. నితీశ్ కుమార్ సిఎంగా పెద్దగా మార్పులకు శ్రీకారం చుట్టింది లేదు. అంతుకుముందు లాలూ ప్రసాద్ యాదవ్ కూడా కుటుంబ సంక్షేమానికే ప్రాధాన్యం ఇచ్చారు. లాలూ లేదా, నితీశ్ కుమార్‌లు పెద్దగా బీహార్‌లో ప్రభావితం చేసేంతగా పాలన సాగించలేదు. ఉత్తరాది రాష్టాల్లో బీహార్ మొదటి నుండి రాజకీయంగా అత్యంత చురుకుగా ఉండే రాష్ట్రంగా గుర్తింపు పొందింది. బీహార్ ఓ రకంగా కళింగ రాజ్యంగా చెప్పుకోవాలి. పాటలీపుత్రాన్ని రాజధానిగా చేసుకుని మౌర్యులు పాలించారు. ఆర్య చాణక్యుడు అక్కడే ఉండేవారు. నలంద విశ్వవిద్యా లంయం ఒకప్పుడు ప్రపంచానికి మార్గం చూపింది. ఇలాంటి నేల బీహార్‌లో ఇప్పుడు అరాచకం సాగుతోంది. ఇకపోతే రాజకీయంగా ఎంతో చైతన్యం కలిగిన నేల అది. అక్కడ చోటుచేసుకునే పరిణామాలు అనేక సందర్భాలలో దేశ వ్యాప్తంగా ప్రభావం చూపాయి. దేశ రాజకీయాలకు దిశా నిర్దేశం చేశాయి. బీహర్‌కు చెందిన జయప్రకాశ్ నారాయణ్ జనతా పార్టీని స్థాపించి దేశ రాజకీయాలను మలుపు తిప్పారు. ఈ నేపథ్యంలోనే అక్కడ జరగనున్న ఎన్నికలు ఆ రాష్ట్రానికే కాకుండా దేశానికే కీలకంగా మారాయి. మరోమారు ఎన్‌డిఎ అధికారం కోసం ఎత్తులు వేస్తోంది. వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ రాజకీయంగా తన అదృష్టాన్ని పరీక్షించుకోబోతున్నారు. బీహార్‌లో అధికారంలో కొనసాగడమే లక్ష్యంగా బిజెపి నేతృత్వం లోని ఎన్‌డిఎ కూటమి ఎన్నో అడ్డదారులు తొక్కుతోంది. హడావిడిగా చేపట్టిన ప్రత్యేక ఓటర్ల సవరణ (సర్)తో ఎన్నికల కమిషన్ స్వతంత్రత ప్రశ్నార్థకం గా మారింది. పెద్దఎత్తున ఓట్ చోరీ ఆరోపణలు వెల్లువెత్తాయి. వీటికి జవాబు ఇచ్చి, సందేహాలను నివృత్తి చేయాల్సిన ఎన్నికల కమిషన్ (ఇసి) గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రతిపక్షాలపై దాడికి దిగుతోంది. అయితే బంగ్లా చొరబాటు దారుల సమస్య కూడా తీవ్రంగా ఉంది. ఓటర్ల జాబితాపై కొనసాగుతున్న నిరసనల మధ్యే తుది జాబితాను, ఎన్నికల షెడ్యూల్‌ను ఇసి విడుదల చేసింది. ఈ షెడ్యూల్ ప్రకారం 243 మంది సభ్యులుగల బీహార్ శాసనసభకు నవంబర్ 6, 11 తేదీలలో పోలింగ్ జరగనుంది. 14వ తేదీన ఫలితాలు ప్రకటిస్తారు. మరోవైపు ఇసి విడుదల చేసిన ఓటర్ల తుది జాబితాపై కూడా దుమారం రేగుతోంది. ఈ జాబితాలోని చేర్పులు, తొలగింపులకు సంబంధించిన పూర్తి వివరాలను తమకు అందచేయడంతో పాటు, వాటిని క్షేత్రస్థాయి వరకు ప్రదర్శించాలని దేశ అత్యున్నత న్యాయస్థానం ఎన్నికల కమిషన్‌ను ఆదేశించింది. ఇకపోతే ఓట్ల తొలగింపు ఆరోపణలు చేస్తున్న రాహుల్ సక్రమంగా రుజువు చేయలేక పోయారు. సుప్రీం కూడా తొలగించిన ఓట్లకు సంబంధించి రుజువులతో అఫిడవిట్ వేయాలని సూచించినా వెనక్కి పోయింది. మరోవైపు ఎన్‌డిఎ కూటమిలో కీలక భాగస్వామిగా ఉన్న నితిష్ కుమార్ ఇప్పటికే 9 సార్లు ముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వహించారు. పదోసారి కూడా ఆ పదవిని ఆయన ఆశిస్తున్నారు. బిజెపి నేతలు ఆ విషయాన్ని తేల్చకుండా రాష్ట్రంలో ప్రభుత్వ వైఫల్యాలకు మాత్రం నితీష్‌ను పూర్తి బాధ్యుడిని చేస్తున్నారు. దీంతో క్షేత్రస్థాయిలో ఓటర్లను మభ్య పెట్టే కుతంత్రాలకు తెరతీస్తోందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. రాబోయే రోజుల్లో ఈ తరహా విన్యాసాలు మరింత జోరందుకోనున్నాయి. 2020లో జరిగిన ఎన్నికల్లో ఎన్‌డిఎ కూటమి కేవలం 0.2 శాతం ఓట్ల ఆధికత్యతను మాత్రమే సాధించింది. దీంతో త్వరలో జరగనున్న ఎన్నికలలో ప్రతి ఓటు కీలకంగా మారనుంది. అదే సమయంలో ప్రతిపక్షాల మధ్య గరిష్ట స్థాయిలో ఐక్యత పెరగాల్సి ఉంది. గత ఎన్నికల్లో చోటు చేసుకున్న తప్పులు మరోసారి జరగకుండా చూసుకోవడంతో పాటు, ప్రజలకు నమ్మకం ఇయ్యవలసిన బాధ్యత ప్రతిపక్షాలదే! అయితే అధికారమే పరమావధిగా అన్ని పార్టీలు విన్యాసాలు చేస్తున్నాయి. తాజాగా 7.42 కోట్ల మంది అర్హులైన ఓటర్లు ఉన్నట్లు ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ ప్రకటించారు. ఈ క్రమంలో బీహార్ అభివృద్ధికి ఏం చేస్తారన్న దానిపై రాజకీయ పార్టీల్లో స్పష్టత లేదు. కేవలం ఓట్లు కొల్లగొట్టి అధికారం దక్కించుకోవడం అందరిపనిగా మారింది. ఈ క్రమంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. నేతల కుయుక్తులను గమనించాలి. తమ ఓటును సక్రమంగా వినియోగించుకోవాలి. తాయిలాలు ఆశపడితే మరో ఐదేళ్లు లొంగిపోవాల్సి ఉంటుందని గుర్తించాలి.

## పాక్‌తో చెలిమి కోసం ట్రంప్ ఆరాటం

పాక్‌తో చెలిమి కోసమే ట్రంప్ ఆరాటం అని, అందుకు భారత్‌తో చెలిమిని వదులు కుంటున్నారని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌పై ఆ దేశ మాజీ రాయబారి ఒకరు సంచలన ఆరోపణలు చేశారు. పాకిస్థాన్ సొమ్ము కోసం ట్రంప్ అహంభావంతో వ్యవహరిస్తున్నారన్నారు. అందుకోసం భారత్-అమెరికా సంబంధాలను కూడా చెడగొట్టారని ఆరోపించారు. జపాన్‌కు అమెరికా మాజీ రాయబారి రహమ్ ఇమాన్యుయేల్ ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. చైనాను ఎదుర్కోవడంలో అగ్రరాజ్యానికి భారత్ అత్యంత కీలకమైన భాగస్వామి. ఆ విషయాన్ని గుర్తించకుండా అధ్యక్షుడు ట్రంప్ అహం చూపిస్తున్నారు. 40ఏళ్ల వ్యూహాత్మక ప్రణాళికను, దౌత్య సంబంధాలను ఆయన వదులు కుంటున్నారు. భారత్-పాక్ మధ్య కాల్పుల విరమణ చేసింది తానేనంటూ ట్రంప్ చేసిన వాదనను భారత ప్రధాని మోదీ అంగీకరించడం లేదు. ఇక, పాక్ నుంచి ట్రంప్ కుమారుడికి భారీ మొత్తంలో డబ్బు అందుతోంది. ఈ కారణాల వల్లే భారత్-అమెరికా సంబంధాలను ట్రంప్ చెడగొడుతున్నారు. ట్రంప్ చేసిన ఈ భారీ తప్పిదాన్ని చైనా తమకు అనుకూలంగా మార్చుకుంటోందని ఇమాన్యుయేల్ ఆరోపించారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో పాకిస్థాన్ క్రిప్టో కౌన్సిల్‌తో, అమెరికా వ్యాపారవేత్త జాక్ విట్కాఫ్ మధ్య బిజినెస్ డీల్ జరిగింది. విట్కాఫ్ కంపెనీలో ట్రంప్ కుమారుడు జూనియర్ ట్రంప్, అల్లుడు జేర్డ్ కుష్నర్ వాటాదారులుగా ఉన్నట్లు వార్తలు వచ్చాయి. దీన్ని ఉద్దేశిస్తూనే ఇమాన్యుయేల్.. ట్రంప్‌పై విమర్శలు గుప్పించారు. ఇమాన్యుయేల్ గతంలో ఒబామా అధ్యక్షుడిగా ఉన్న సమయంలో వైట్‌హౌస్ చీఫ్ ఆఫ్ స్టాఫ్‌గా పనిచేశారు.

## ట్రంప్‌కు లొంగిపోయిన మోడీ

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హెచ్చరికలకు ప్రధాని మోడీ లొంగిపోయారని విపక్షనేత రాహుల్ గాంధీ ఆరోపించారు. భారత్ రష్యా నుంచి చమురు కొనుగోలు చేయొద్దని, చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిస్తున్నా, మోడీ నుంచి సమాధానం లేదన్నారు. ఈ బెదిరింపు చర్యల్లో భాగంగానే అమెరికా భారత్‌పై పెద్దఎత్తున సుంకాల్ని విధించిన సంగతి తెలిసిందేనన్నారు. ఈ నేపథ్యంలో భారత్ అమెరికాకు తలొగ్గి రష్యా నుంచి ఆయిల్‌ని కొనుగోలును నిలిపివేస్తున్నట్లు తనకు హామీ ఇచ్చిందని అమెరికా అధ్యక్షుడు వ్యాఖ్యానించారు. ట్రంప్ వ్యాఖ్యలపై లోక్‌సభ ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ అభ్యంతరం వ్యక్తం చేశారు. ట్రంప్‌కి మోడీ భయపడిపోయారని రాహుల్ ఆరోపించారు. దీనికి తాజా సంఘటనలే తార్కాణమని రాహుల్ ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు. భారత్ రష్యా నుంచి ఆయిల్ కొనుగోలు చేయదని ట్రంప్ నిర్ణయానికి మోడీ అనుమతించడం,. భారత్‌పై వివాదాస్పద వ్యాఖ్యలు ట్రంప్ చేస్తున్నప్పటికీ.. ప్రధాని మోడీ ట్రంప్‌కి పదేపదే అభినందనలు తెలుపుతూ సందేశాలు పంపడం ఏమిటన్నారు. ఆర్థికమంత్రి అమెరికా పర్యటనను రద్దు చేసుకోవడం, ఈజిప్టు షర్మ్ ఎల్ షేక్‌లో జరిగిన గాజా శాంతి శిఖరాగ్ర సమావేశానికి హాజరుకాకపోవడం,ఆపరేషన్ సింధూర్ సమయంలో ట్రంప్ జోక్యం చేసుకుని యుద్ధాన్ని ఆపానని చెబుతున్నప్పటికీ మోడీ నోరెత్తకపోవడం... ఆ వ్యాఖ్యల్ని విభేదించకపోవడం వంటి చర్యల్ని చూస్తే.. మోడీ ట్రంప్‌కి భయపడిపోయారని తెలుస్తోందని రాహుల్ ఎక్స్ పోస్టులో ప్రధానిని విమర్శించారు.

# ఇది కేవలం డేటా సెంటర్ కాదు..
# విశాఖ టెక్ రివల్యూషన్‌కి మొదటి అడుగు

- ఇక అమెరికా వెళ్లాల్సిన అవసరం లేదు
- అదే టెక్ వాతావరణం ఇక్కడే
- నిన్నంతా విశాఖలో గూగుల్ AI డేటా సెంటర్‌లపై బోలెడంత చర్చ నడిచింది. ఆ శబ్దం, ఆ noise మధ్య ఇప్పుడు ఆ విషయాన్ని టెక్నికల్‌గా, వివరంగా చూద్దాం

అసలు AI డేటా సెంటర్‌లలో ఏమి జరుగుతుంది?

AI అంటే Artificial Intelligence, అంటే యంత్రాలకు నేర్చుకునే, ఆలోచించే సామర్థ్యం ఇవ్వడం.ఇది సాధ్యమవ్వాలంటే వేల సంఖ్యలో లెక్కలు, అనేక డేటా విశ్లేషణలు, ప్యాటర్న్ గుర్తింపు వంటి ప్రక్రియలు చాలా వేగంగా జరగాలి.దానికి కావలసిన శక్తిని ఇస్తుంది GPU!

### GPU అంటే ఏమిటి?

GPU (Graphics Processing Unit) అనేది మొదట గేమ్స్, వీడియోలు, గ్రాఫిక్స్ ప్రాసెసింగ్ కోసం రూపొందించబడింది.

కానీ ఇప్పుడు ఇది AI ప్రపంచంలో హృదయం

CPU (Central Processing Unit) ఒక్కో పని వరుసగా చేస్తుంది.

GPU అయితే ఒకేసారి వందల పనులు చేస్తుంది. దీన్నే parallel processing అంటారు.

అందుకే AI మోడల్స్‌కి GPUలు అవసరం అవుతాయి

డీప్ లెర్నింగ్ ట్రైనింగ్ (ఉదా: ChatGPT, Gemini, Image Recognition)

### డేటా ప్రాసెసింగ్ వేగం పెరగడం

### మోడల్ రిస్పాన్స్‌లు వేగంగా రావడం

సరళంగా చెప్పాలంటే:

AI R మెదడు | GPU R ఆ మెదడుకి శక్తినిచ్చే ఇంజిన్

విశాఖ డేటా సెంటర్‌లో GPUల పాత్ర

ఇప్పుడు చూద్దాం.. విశాఖలోని గూగుల్ డేటా సెంటర్‌లో GPUలు ఎలా పని చేస్తాయో..

### AI మోడల్స్ ట్రైనింగ్‌కి

ChatGPT, Google Gemini, YouTube Recommender లాంటి మోడల్స్ బిలియన్ల డేటా మీద నేర్చుకుంటాయి. GPUలు ఒకేసారి వేల లెక్కలు వేగంగా ప్రాసెస్ చేయగలవు కాబట్టి ట్రైనింగ్ వేగంగా పూర్తి అవుతుంది.

### రియల్‌టైమ్ ఇన్ఫరెన్స్‌కి


మోడల్‌ని యూజర్లు వాడేటప్పుడు GPUలు సమాధానాలను వేగంగా ఇవ్వడానికి సహాయ పడతాయి.

ఉదా: మీరు Google Photosలో dog photos" అని వెతికితే, క్షణాల్లో ఫలితం చూపించడం GPU ప్రాసెసింగ్ వల్లే!

### క్లౌడ్ సర్వీసుల బలం

Google Cloud GPU ఆధారిత సర్వీసులను ప్రపంచానికి అందిస్తుంది.

విశాఖలో GPU ఫార్మ్‌లు ఉండటం వల్ల ౧ ప్రపంచంలోని డెవలపర్లు వాటిని remoteగా access చేయగలరు.



### స్థానిక ఇన్నోవేషన్ & స్టార్టప్స్‌కు సహకారం

విశాఖలో GPU ఇన్ఫ్రా ఉండటం వల్ల ౧ స్థానిక విద్యార్థులు, ఇంజినీర్లు, స్టార్టప్స్ కూడా AI రీసెర్చ్, ప్రోటోటైప్ టెస్టింగ్ చేయగలరు.

ఇక అమెరికా వెళ్లాల్సిన అవసరం లేదు. అదే టెక్ వాతావరణం ఇక్కడే!

### భవిష్యత్ టెక్నాలజీలకు పునాది

GPUలు లేకుండా ఇవన్నీ సాధ్యం కాదు

Self-driving Cars

Voice & Image Recognition

Healthcare AI

Smart Cities

Industrial Robotics

విశాఖ డేటా సెంటర్ ఈ టెక్నాలజీలకు బేస్‌లైన్‌గా పనిచేస్తుంది

విశాఖలో GPUలు ప్రపంచానికి ఎలా ఉపయోగపడతాయి?

GPUలు ఉన్నప్పుడు

ప్రపంచం నలుమూలల నుండి స్టార్టప్స్, కంపెనీలు, రీసెర్చ్ సంస్థలు GPU క్లస్టర్స్‌ని విశాఖ నుంచే యాక్సెస్ చేయగలవు. అంటే విశాఖ ఒక గ్లోబల్ AI పవర్ హబ్ అవుతుంది.

GPUల డిమాండ్ ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న సమయంలో,

"విశాఖలో GPUలు పని చేస్తే.. ప్రపంచానికి తెలివి ఇక్కడినుండే వెలువడుతుంది!"

### విశాఖలో గూగుల్ AI హబ్ భవిష్యత్తుకి గేట్వే!

**టెక్ ఎకోసిస్టమ్ బూమ్:** గూగుల్ రాగానే చుట్టూ వందల కంపెనీలు, స్టార్టప్స్, సప్లై చైన్ బిజినెస్‌లు పెరుగుతాయి.

**ఉద్యోగ అవకాశాలు:** స్థానిక టాలెంట్‌కి ప్రపంచ స్థాయి పనులు, శిక్షణలు, ఇన్నోవేషన్ చాన్స్‌లు.

**ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్:** రోడ్లు, పవర్, ఇంటర్నెట్, హౌసింగ్ వేగంగా అభివృద్ధి చెందుతాయి.

**ఇన్వెస్ట్మెంట్ మాగ్నెట్:** గూగుల్ తర్వాత వందల అంతర్జాతీయ కంపెనీలు పెట్టుబడులు పెడతాయి.

**స్కిల్స్ & లెర్నింగ్ హబ్:** AI, డేటా సైన్స్, క్లౌడ్, సైబర్ సెక్యూరిటీ ట్రైనింగ్ అవకాశాలు విస్తరిస్తాయి.

### తుది మాట

AI ఆపరేషన్స్‌కి భారీ రిసోర్సెస్ అవసరం.

గూగుల్ లాంటి సంస్థ US బయట ఇంత పెద్ద డేటా సెంటర్ ఏర్పాటు చేయడం మామూలు వార్త కాదు.

ఇది కేవలం గూగుల్ రాక కాదు ఒక ఎకోసిస్టమ్ పుట్టుక.

ఒకసారి పెద్ద పెట్టుబడి వస్తే

GPUల కోసం, టెక్ కోసం, కొత్త అవకాశాల కోసం మరెన్నో కంపెనీలు వస్తాయి.ఇక US వెళ్లాల్సిన అవసరం తగ్గిపోతుంది

ఇంట్లోనే ప్రపంచ స్థాయి టెక్ భవిష్యత్తు పుడుతుంది!

ఇది కేవలం డేటా సెంటర్ కాదు. విశాఖ టెక్ రివల్యూషన్‌కి మొదటి అడుగు..

# తిరుగలేని శక్తిగా భారత్ అభివృద్ధి

ప్రధాని మోదీ భారత్‌ను తిరుగులేని శక్తిగా మారుస్తున్నారని ఏపీ మంత్రి నారా లోకేశ్ అన్నారు. కర్నూలు శివారులోని నన్నూరు వద్ద 'సూపర్ జీఎస్టీ- సూపర్ సేవింగ్స్' పేరుతో ఏర్పాటు చేసిన బహిరంగసభలో లోకేశ్ ప్రసంగించారు. పలు సినిమాల్లోని డైలాగులు చెబుతూ ప్రధానిపై ప్రశంసలు కురిపించారు. 'పహల్గాం దాడి తర్వాత 'నమో' దెబ్బకు పాకిస్థాన్ దిమ్మతిరిగింది. అమెరికా సుంకాలు పెంచితే పెద్ద దేశాలే వణికిపోయాయి. కానీ, నమో స్టైలే వేరు. పేద, మధ్యతరగతి ప్రజలపై జీఎస్టీ భారం తగ్గించారు. దసరా-దీపావళి కలిసి వస్తే ఎలా ఉంటుంది. అలాంటి పండగను దేశ ప్రజలకు అందించారని లోకేశ్ తెలిపారు. బ్రిటీష్ వారిని గడగడలాడించిన ఉయ్యాలవాడ పుట్టిన నేల అని.. కర్నూలు ప్రజల రాజసం కొండారెడ్డి బురుజు అని చెప్పుకొచ్చారు. మన నమో అంటే విక్టరీ.. ఆయన ఏ కార్యక్రమం చేపట్టినా విజయమే అని అన్నారు. గుజరాత్ సీఎంగా.. దేశ ప్రధానిగా 25 ఏళ్లు పూర్తి చేస్తుకున్నారని తెలిపారు. దేశాన్ని సూపర్ పవర్‌గా మార్చిన ఘనత మోదీది అంటూ మంత్రి కొనియాడారు. మోదీ కొట్టిన దెబ్బకు పాక్ దిమ్మ తిరిగిందన్నారు. ట్రాంప్ టారిఫ్స్‌తో పలు దేశాలు వణికినా మోదీ బెదరలేదని అన్నారు. జీఎస్టీ తగ్గింపుతో ప్రజలకు సూపర్ సేవింగ్ అయ్యిందన్నారు. పేద ప్రజల చిరునవ్వే మోదీకి పండుగన్నారు. దేశాన్ని సూపర్ పవర్‌గా మార్చిన ఘనత మోదీదే అని వెల్లడించారు. జీఎస్టీ తగ్గింపుతో రూ.8వేల కోట్ల ఆదాయం కోల్పోతామని చెప్పినా.. పేదలకు మంచి జరుగుతుందని సీఎం




అన్నారని తెలిపారు. డబుల్ ఇంజన్ బు÷-లలెట్ ట్రైన్ సర్కార్ కేంద్రంలో, రాష్ట్రంలో ఉందన్నారు. పారిశ్రామిక ప్రాజెక్టులు, రైల్వే, హైవే ప్రాజెక్టులు ఏపీకి వచ్చాయని చెప్పారు. భారత్ 4వ ఆర్థిక వ్యవస్థగా ఎదగడానికి కారణం ప్రధాని మోదీనే అని అంటూ ప్రధానిపై మంత్రి లోకేష్ ప్రశంసల వర్షం కురిపించారు. కాగా.. జిల్లాలో ప్రధాన ప్రధాన మంత్రి నరేంద్ర పర్యటన కొనసాగుతోంది. శ్రీశైలం శ్రీభ్రమరాంబ మల్లికార్జున స్వామిని దర్శనం అనంతరం నన్నూరులో 'సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్' బహిరంగసభలో పాల్గొన్నారు ప్రధాని. ఈ సభలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీకి శివుడి జ్ఞాపికను బహుకరించారు సీఎం. ఆపై మోదీని సీఎం, డిప్యూటీ సీఎం శాలువతో సత్కరించారు. అలాగే ప్రధానికి ఏపీ బీజేపీ చీఫ్ మాధవ్ ఆంజనేయస్వామి జ్ఞాపిక అందజేశారు.

# 2 నుంచి లండన్‌లో సిఎం చంద్రబాబు పర్యటన

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విదేశీ పర్యటన ఖారారు అయింది. నవంబర్ 2 నుంచి 5వ తేదీ వరకు సీఎం చంద్రబాబు నాయుడు బ్రిటన్ రాజధాని లండన్‌లో పర్యటించనున్నారు. రాష్ట్రంలో పెట్టుబడులు తేవడమే లక్ష్యంగా ఆయన ఈ పర్యటన చేస్తున్నారు. ఈ పర్యటనలో భాగంగా లండన్‌లోని పలువురు పారిశ్రామిక వేత్తలతో సీఎం చంద్రబాబు సమావేశం కానున్నారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు గల అవకాశాలను వారికి ఆయన సోదాహరణగా వివరించనున్నారు. నవంబర్ 14, 15 తేదీలలో విశాఖపట్నం వేదికగా భాగస్వామ్య సదస్సు జరగనుంది. ఈ సదస్సుకు హాజరు కావాలని ఆ పారిశ్రామిక వేత్తలను సీఎం చంద్రబాబు ఆహ్వానించనున్నారు. సీఎం చంద్రబాబు, సీనియర్ ఐఏఎస్ అధికారి కార్తికేయ మిశ్రాతోపాటు పలువురు అధికారుల బృందం లండన్ బయలుదేరి వెళ్లనుంది. ఈ మేరకు సాధారణ పరిపాలన శాఖ ముఖ్య కార్యదర్శి ముఖేశ్ కుమార్ మీనా గురువారం ఆదేశాలు జారీ చేశారు. మరోవైపు అక్టోబర్ 22 నుంచి 24వ తేదీ వరకు సీఎం చంద్రబాబు నాయుడు దుబాయ్, అబుదాబి, యూఏఈలలో పర్యటించనున్నారు. విశాఖపట్నంలో జరిగే భాగస్వామ్య సదస్సుకు విదేశీ పెట్టుబడుదారులను ఆహ్వానించేందుకు ఆయా దేశాల్లో ఆయన పర్యటించనున్నారు.

పర్యటనలో భాగంగా రియల్ ఎస్టేట్స్, భవన నిర్మాణం, లాజిస్టిక్స్‌తోపాటు రవాణా, ౧÷నాన్స్ సర్వీసెస్, ఇన్నోవేషన్స్ రంగాల్లో పెట్టుబడుదారులను ఆయన ఆహ్వానం పలకనున్నారు. ఈ విదేశీ పర్యటనకు సీఎం చంద్రబాబు వెంట మంత్రులు టీజీ భరత్, బీసీ జనార్దన్ రెడ్డిలతోపాటు వివిధ శాఖలకు చెందిన పలువురు ఉన్నతాధికారులు వెళ్లనున్నారు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధే లక్ష్యంగా చంద్రబాబు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. రాజధాని అమరావతితో పాటు.. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల అభివృద్ధి కోసం సర్కార్



కీలకంగా అడుగులు వేస్తోంది. అందులో భాగంగా సీఎం చంద్రబాబు విదేశాల్లో పర్యటిస్తూ.. రాష్ట్రాభివృద్ధి కోసం అహర్నిశలు శ్రమిస్తున్నారు. ఆ క్రమంలో ఇప్పటికే సింగపూర్, దావోస్‌లో సైతం ఆయన పర్యటించారు. విశాఖపట్నం వేదికగా నవంబర్‌లో రెండు రోజుల పాటు భాగస్వామ్య సదస్సు జరగనుంది. భారీ ఎత్తున నిర్వహించే ఈ సదస్సుకు వివిధ దేశాల ప్రతినిధులు, పారిశ్రామికవేత్తలను ఇప్పటికే ఏపీ ప్రభుత్వం ఆహ్వానించింది. మరోవైపు ఏపీ మున్సిపల్ శాఖ మంత్రి నారాయణపాటు పలువురు ఉన్నతాధికారులు సైతం దక్షిణ కొరియాలో పర్యటించారు. ఈ పర్యటన సందర్భంగా ఆ దేశ ప్రభుత్వాధికారులతోపాటు పారిశ్రామికవేత్తలతో ఈ బృందం వరుస భేటీలు నిర్వహించింది. ఆ దేశ ప్రతినిధి బృందాన్ని సైతం ఈ సదస్సుకు మంత్రి నారాయణ ఆహ్వానించిన విషయం విదితమే.

తెలుగు దినపత్రిక https://aksharagalam.com అక్షరగళం ప్రతి అక్షరం ప్రజల కోసం



## ఇక్కడ నో సెల్ఫీ!

సెల్ఫీ మోజు ఎక్కడెలా ఉన్నా.. పర్యాటక పర్వంలో మాత్రం విపరీతంగా పెరిగిపోయింది. ఏ ప్రాంతానికి వెళ్లినా.. పర్యాటకుల కళ్ల కన్నా ముందు చరవాణి లెన్సే చుట్టుపక్కలు చూసేస్తున్నాయి. క్లిక్ మనిపిస్తున్నాయి. మన్నూమిన్నూ కానకుండా ప్రమాదపుటంచుల్లోనూ సెల్ఫీ పోజులిస్తున్నారు కొందరు. అత్యుత్సాహం అదుపతప్పితే? సెల్ఫీ కాస్తా కిల్ఫీగా మారిపోతోంది. ఈ పరిస్థితికి చెక్ పెట్టడానికి కేంద్ర పర్యాటక శాఖ కొత్త విధానానికి శ్రీకారం చుట్టింది. విహార కేంద్రాల్లో 'నో సెల్ఫీ జోన్' ఏర్పాటు చేయనుంది. డేంజర్ జోన్స్‌లో సెల్ఫీలను నియంత్రించడానికి ప్రణాళిక రూపొందిస్తున్నారు అధికారులు. ప్రమాదాలు జరగడానికి అవకాశం ఉన్న ప్రదేశాల్లో బారికేడ్లు ఏర్పాటు చేయనున్నారు. ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా.. పర్యాటకులు అత్యుత్సాహంతో ప్రాణాల మీదికి తెచ్చుకోకుండా, స్వీయ నియంత్రణ పాటించాలంటున్నారు.



## అరచేతిలో అద్భుతం..

**డానాంగ్:** అర చేతుల్లో అద్భుతం.. ఈ ఫోటో చూసిన వెంటనే ఎవరికైనా ఇదే మాట తడుతుంది. దూరం నుంచి చూసే వారికి ఇంత పెద్ద భారీ వంతెనను పడిపోకుండా ఈ రెండు చేతులు కాపాడుతున్నాయేమో అన్పిస్తోంది. మరి ఆ అర చేతుల్లో మనం కూడా వాలిపోవాలంటే.. చలో వియత్నాం. 'గోల్డెన్ హ్యాండ్స్' అని పిలుచుకుంటున్న ఈ వంతెన వియత్నాంలోని బనా హిల్స్ రిసార్ట్ వద్ద నిర్మించారు.

ఈ వంతెనను సముద్ర మట్టానికి సుమారు 4593 అడుగుల ఎత్తులో కట్టారు. వంతెనకు ఇరు పక్కల వంగపువ్వు రంగులో ఉండే లోబిలియా చామంతి పూల మొక్కలను నాటారు. దూరం నుంచి చూసినప్పుడు అడవిలో నుంచి రెండు భారీ చేతులు వచ్చి ఈ వంతెనను పట్టుకున్నాయేమో అనిపిస్తోంది.

జూన్ నెలలో ప్రారంభించిన ఈ వంతెనను చూడటానికి ఇప్పుడు ప్రపంచ నలుమూలల నుంచి పర్యాటకులు పోటెత్తుతున్నారు. అంతేనా ఈ వంతెనకు సంబంధించిన ఫోటోలు కూడా సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతున్నాయి.

ఈ ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు వియత్నాం ప్రభుత్వం దాదాపు 10 వేల కోట్ల రూపాయలు కేటాయించింది. ఇందులో భాగంగా ఈ 'గోల్డెన్ బ్రిడ్జి'ని నిర్మించారు. ఈ వంతెనపై నిల్చోని చూస్తే ఆకాశానికి చాలా దగ్గరగా ఉన్నట్లు అన్పిస్తోంది అంటున్నారు పర్యాటకులు. అయితే ఈ వంతెనపైకి కేవలం పాదచారులను మాత్రమే అనుమతిచ్చింది వియత్నాం ప్రభుత్వం.

## 'టీ' అమ్ముతూ
## 23 దేశాలను చుట్టేశారు...


టీ అమ్మే ప్రతి ఒక్కరూ.. ప్రధాని కాకపోవచ్చు. కానీ, విదేశీ ట్రిప్పులు వేయొచ్చు. ఇందుకు ఈ వృద్ధ జంటే నిదర్శనం. కేరళాలోని కోచికి చెందిన విజయన్, మోహన అనే దంపతులు తమ 45 ఏళ్ల వైవాహిక జీవితంలో 23 దేశాలను చుట్టివచ్చి అందరినీ ఆశ్చర్యపరుస్తున్నారు. అందులో చిత్రం ఏముందీ? వారికి బాగా డబ్బుందేమో అనుకుంటే పొరపాటే! కేవలం టీ అమ్ముతూ వచ్చిన డబ్బులతోనే ఆ జంట విదేశాల్లో పర్యటిస్తున్నారు.

**ఇదీ టూర్ ప్లాన్:**

విజయన్, మోహనాలు కోచీలో 'శ్రీబాలాజీ కాఫీ హౌస్' అనే టీ, కాఫీ షాపు నడుపుతున్నారు. వారికి ప్రపంచ పర్యటన చేయాలనేది కల. ఇందుకు చాలా డబ్బు అవసరమని వారికి తెలుసు. టీ అమ్మగా వచ్చే రాబడి అందుకు సరిపోదు. దీంతో కొంత మొత్తాన్ని పొదుపు చేస్తూ.. మిగతా సొమ్మును బ్యాంక్ నుంచి రుణంగా తీసుకునేవారు. ఆ డబ్బుతో విదేశాలు తిరిగి వచ్చేవారు. పర్యటన ముగించిన వచ్చిన తర్వాత తీసుకున్న రుణాన్ని తీర్చేసి మరో ట్రిప్‌కు ప్లాన్ చేసేవారు.

**ఈ సందర్భంగా విజయన్ మాట్లాడుతూ..**

"జీవితంలో ప్రతి ఒక్కరికీ ఏదో ఒక లక్ష్యం ఉంటుంది. ప్రపంచం మొత్తం చుట్టిరావాలనేది నా చిననాటి కోరిక. పెళ్లికి ముందు నా భార్య ఎర్నాకులం దాటి ఎక్కడికి వెళ్లేది కాదు. పెళ్లైన తర్వాత నాతో కలిసి దేశం మొత్తం తిరిగేసింది. ఇప్పుడు విదేశాల్లో సైతం పర్యటిస్తూ ఎంతో సంతోషంగా ఉంది" అని తెలిపారు.



విజయన్ 1963 నుంచి టీ అమ్ముతూ కుటుంబాన్ని నడుపుతున్నారు. ఆయన దుకాణంలోని గోడలపై వారి విదేశీ పర్యటనలకు సంబంధించిన ఫోటోలు, వాటి బిల్లులు, వివిధ దేశాల కరెన్సీ నోట్లను చూడొచ్చు. వీరి దుకాణంలో పనివాళ్లు ఎవరూ ఉండరు. పనివారికి అయ్యే ఖర్చులు కూడా మిగులుతున్నాయి. ఇప్పటివరకు తిరిగిన 23 దేశాల్లో విజయన్‌కు సింగపూర్, స్విట్జర్లాండ్, న్యూయార్క్ దేశాలు బాగా నచ్చాయట. త్వరలో తాను స్వీడన్, డెన్మార్క్, నెదర్లాండ్, గ్రీన్ ల్యాండ్, నార్వేలు చుట్టి రానున్నట్లు తెలిపాడు.

**ఆనంద్ మహీంద్ర ట్వీట్‌తో వైరల్..:**




మహీంద్ర గ్రూప్ ఛైర్మన్ ఆనంద్ మహీంద్ర సోషల్ మీడియాలో నిత్యం యాక్టివ్‌గా ఉంటూ ఆసక్తికరమైన ట్వీట్స్ చేస్తుంటారు. ఇందులో భాగంగా విజయన్ దంపతులపై రూపొందించిన ఓ వీడియోను పోస్ట్ చేశారు. 'ఫోర్బ్స్ ధనవంతుల జాబితాలో వారి పేరు కనిపించకపోవచ్చు. కానీ, వారు దేశంలో అత్యంత సంపన్నులు. వారి జీవన విధానమే వారికి ఆస్తి. నేను ఎప్పుడైనా ఆ నగరానికి వెళ్తే తప్పకుండా ఆగి, అక్కడ టీ తాగుతాను" అని ట్వీట్ చేశారు. ఈ ట్వీట్ ఇప్పుడు ఇంటర్నెట్‌లో వైరల్‌గా మారింది. దీంతో సోషల్ మీడియా అంతటా ఈ జంట గురించే చర్చ జరుగుతోంది.

ఈ జంటపై హరిమోహన్ అనే డైరెక్టర్ 'ఇన్విజిబుల్ వింగ్స్' అనే డాక్యుమెంటరీ రూపొందించారు. ఈ చిత్రానికి 2018 ఫిల్మ్‌ఫేర్ అవార్డ్స్ కార్యక్రమంలో నాన్ ఫిక్షన్ విభాగంలో అవార్డు దక్కింది. ఇందులో విజయన్ తన లైఫ్'జర్నీ' గురించి ఎంతో స్పష్టంగా అందంగా వివరించాడు. ఈ డాక్యుమెంటరీ మీకు కూడా బాగా నచ్చేస్తుంది.

అరుణాచల్ ప్రదేశ్‌లో వెళ్లినప్పుడు తప్పకుండా లోయర్ సుబాన్సిరీ జిల్లాలో సముద్ర తలానికి 1500 మీటర్ల ఎత్తులో ఉన్న 'జిరో'ను తప్పకుండా సందర్శించాలి.

పూతోటల స్వర్గంగా పేరొందిన అరుణాచల్ ప్రదేశ్.. ప్రకృతి అందాలకు పెట్టింది పేరు. దేశానికి ఈశాన్యంలో ఉన్న ఈ రాష్ట్రం 1987 వరకు అస్సాంలో ఉండేది. చైనాతో ఏర్పడిన సరిహద్దు వివాదాల దృష్ట్యా ఈ ప్రాంతానికి రాష్ట్ర హోదాను కల్పించారు. చైనాతో ఉన్న వివాదాలను పక్కనపెడితే.. ఈ రాష్ట్రంలో పర్యాటకులను ఆకట్టుకునే ఎన్నో ఆకర్షణలు ఉన్నాయి.



## ఆ ఊరి పేరు జిరో...
## ప్రకృతి అందాల్లో హీరో!



**జిరో:** అరుణాచల్ ప్రదేశ్‌లో వెళ్లినప్పుడు తప్పకుండా లోయర్ సుబాన్సిరీ జిల్లాలో సముద్ర తలానికి 1500 మీటర్ల ఎత్తులో ఉన్న 'జిరో'ను తప్పకుండా సందర్శించాలి. ఈ ప్రాంతాన్ని UNESCO ప్రపంచ వారసత్వ సంపదలో చేర్చేందుకు ప్రతిపాదించింది. ఇక్కడి ప్రజల ఆచారాలు ఎంతో భిన్నంగా ఉంటాయి. ప్రాచీన అపతానీ తెగకు చెందిన గిరిజనులకు ఇది పుట్టినిల్లు. వీరి జీవనాధారం వ్యవసాయం. చుట్టూ అందమైన పర్వతాలు.. మధ్యలో వ్యవసాయ క్షేత్రాలతో జిరో ఎంతో అహ్లాదకరంగా ఉంటుంది. వేసవిలో భిన్నమైన చల్లని హిల్ స్టేషన్ చూడాలనే ఆసక్తి ఉంటే తప్పకుండా ఈ ప్రాంతానికి విచ్చేయండి. ఏటా సెప్టెంబర్ నెలలో జరిగే జిరో మ్యూజిక్ ఫెస్టివల్‌ను చూసేందుకు దేశ విదేశాల నుంచి యువత ఇక్కడికి తరలివస్తారు. ఇటానగర్ నుంచి 167 కిమీలు ప్రయాణిస్తే 'జిరో'కు చేరుకోవచ్చు. అరుణాచల్ ప్రదేశ్‌లో 'జీరో' మాత్రమే కాదు.. మరెన్నో ముఖ్యమైన పర్యాటక ప్రాంతాలు ఉన్నాయి. అవేంటో చూడండి.

**తవాంగ్:** సముద్ర మట్టానికి 10,000 అడుగుల ఎత్తులో ఉన్న తవాంగ్ అందమైన సరస్సులు మైమరపిస్తాయి. అంతేకాదు, ఇక్కడి బౌద్ధ మఠాలు సైతం కనువిందు చేస్తాయి. సుమారు 400 ఏళ్ల కిందటి తవాంగ్ బౌద్ధమఠాన్ని తప్పకుండా చూడాలి. దేశంలో ఉన్న అతిపెద్ద మఠాల్లో తవాంగ్ మఠం కూడా ఒకటి. తవాంగ్‌లోని సెలా పాస్, తక్త్సాంగ్ గోంపా, సముద్రతలానికి 22,500 అడుగుల ఎత్తైన గొరించెన్ శిఖరం, షాంగ్‌త్సర్ లేక్, నౌరంగ్ జలపాతం, పాన్‌కాంగ్ తెంగ్ త్సో లేక్ సరస్సు, బుమ్లా పాస్, బాప్ తెంగ్ కాంగ్ జలపాతం, జస్వంత్ గర్హ్ తదితర ప్రాంతాలను చూడదగినవి.

**రోయింగ్:** అరుణాచల్ ప్రదేశ్‌లో చూడదగిన మరో ముఖ్యమైన ప్రదేశం.. రోయింగ్. ఇది దిబాంగ్ పర్వతం దిగువన ఉంది. ప్రకృతి ప్రేమికులు.. ఈ ప్రాంతాన్ని చూస్తే ఫిదా అయిపోతారు. ఇక్కడి కట్టడాలు, అడ్వేంచర్లు కూడా పర్యాటకులను ఆకట్టుకుంటాయి. ఇక్కడ కూడా ఎన్నో సరస్సులు, జలపాతాలు ఉన్నాయి. మయుడియా నుంచి హిమాలయాల అందాలు మనసు దోచుకుంటాయి. మేఘాలు చేతికి అందే ఈ ప్రాంతంలో మంచుతో నిండిన హిమగిరులు భలే అందంగా కనిపిస్తాయి. పర్వతాల మధ్య ఉన్న మెహో లేక్, మెహో వన్యప్రాణుల అభయారణ్యం, భిస్మాక్ నగర్ కోట, హునిలీ పర్వతం, నిజోమగాట్, రుక్మిణీ నతికోట, సాల్లీ సరస్సు, ఇఫీపానీ ఘాట్ ప్రాంతాలు ఆకట్టుకుంటాయి.

**ఇటానగర్:** అరుణాచల్ ప్రదేశ్ రాష్ట్ర రాజధాని ఇటానగర్ చూడకపోతే మీ జర్నీ పూర్తికానట్లే. ఇటానగర్ వన్యప్రాణుల అభయారణ్యం, ఇటా కోటా, స్టేట్ మ్యూజియం, గంగా సరస్సు, పోలో పార్క్ ఇంకా ఎన్నో ఇక్కడ చూడొచ్చు. అంతేకాదు, శతాబ్దాల కాలం నాటి భవనాలు, హిమాలయన్ నల్ల ఎలుగుబంటి వంటి అరుదైన జంతు జాతులను ఇక్కడ చూడొచ్చు.


**బొమ్డిలా:** సముద్రతలానికి 8000 అడుగుల ఎత్తులో ఉన్న బొమ్డిలా నుంచి మంచుతో నిండిన హిమగిరుల అందాలు మది దోచుకుంటాయి. ఇక్కడి చల్లని వాతావరణం ఎంతో ఆహ్లాదాన్ని అందిస్తాయి. యాపిల్ తోటలు భలే అందంగా కనిపిస్తాయి. షాపింగ్‌కు కూడా ఇది బెస్ట్ ప్లేస్. సెస్సా అభయారణ్యం, ఈగల్ నెస్ట్ అభయారణ్యం, దిరంగ వ్యాలీ, బొమ్డిలా బౌద్ధ మఠం, ఆర్.ఆర్.హిల్‌పాయింట్,

**ఇలా చేరుకోవాలి:**

అరుణాచల్ ప్రదేశ్ రాజధాని ఇటానగర్‌కు వెళ్లేందుకు గౌహతి, షిల్లాంగ్‌ల నుంచి రోడ్డు మార్గంలో చేరుకోవాలి. విమానంలో వెళ్లాలనుకునేవారు కోల్‌కతా విమానాశ్రయం నుంచి లిలాబరీకి చేరుకుని, అక్కడ నుంచి 141 కిమీలు ప్రయాణించాలి. హైదరాబాద్ నుంచి వెళ్లాలంటే గౌహతి విమానాశ్రయంలో దిగి రోడ్డు మార్గంలో ఇటానగర్ చేరుకోవాలి.

## అతిథిగా.. మీకోసం ఓ రోజు

పనుల కోసం ఒక రోజు.. పరుల కోసం మరో రోజు.. ఒంట్లో బాగోకపోతే ఇంకో రోజు.. ఇదండీ వరస. తన కోసం ఓ రోజు ఎప్పుడు? అదే స్టేకేషన్. పర్యాటక నిఘంటువులో కొత్తగా వచ్చి చేరిన పదమిది. ఒంటరిగానో, కుటుంబంతోనో అనుకోకుండా ఒకరోజు తీరికగా గడపడమే స్టేకేషన్ ప్రధాన ఉద్దేశం. ఇటీవలి కాలంలో ఈ ట్రెండ్‌ను ఫాలో అవుతున్నవారు ఎక్కువయ్యారు. స్టేకేషన్ అంటే వందల కిలోమీటర్లు ప్రయాణించాల్సిన పనిలేదు. ప్రకృతి కేంద్రానికి, పుణ్య క్షేత్రానికి వెళ్లాల్సిన అవసరమూ లేదు. మంచి రిసార్టులోనో, స్టార్ హోటల్‌లోనో ఓ గదిని బుక్ చేసుకొని.. రోజంతా అందులో గడిపేయడమే! ఉన్న ఊళ్లో అతిథిగా ఉండటమే ఇందులోని గమ్మత్తు! కొన్ని నియమాలు పాటిస్తే.. స్టేకేషన్‌లోని ఆనందాన్ని ఆస్వాదించవచ్చు. చరవాణిని అటకెక్కించి టీవీలో సినిమాలు చూస్తూ.. నచ్చిన పుస్తకం చదువుతూ.. కోరింది తింటూ.. కాలక్షేపం చేయాలి. సాయంత్రం పూట హోటల్ పైకి చేరుకొని.. నగరాన్ని చూస్తూ కాసేపు గడిపేయాలి. పని ఒత్తిడిలో హడావుడిగా కనిపించే నగరం.. అప్పుడు మరోలా దర్శనమిస్తుంది. వారాంతంలో స్టేకేషన్ చేసి.. పునరుత్తేజంతో మళ్లీ పనిలో నిమగ్నమవుతున్నవారు ఎందరో ఉంటున్నారు. ఇలాంటి వారి కోసం స్టార్ హోటళ్లు, రిసార్టులు స్టేకేషన్ ప్యాకేజీలూ ప్రకటిస్తున్నాయి. హైదరాబాద్, బెంగళూరు వంటి నగరాల్లో స్టేకేషన్ ప్యాకేజీల ధరలు రూ.2,000 నుంచి రూ.15,000 వరకు పలుకుతున్నాయి.



## ట్రావెల్ టిప్స్

**ఈ వేసవి పర్యటనలలో మంచి ఫోటోలు కావాలనుకుంటున్నారా? అయితే ఈ టిప్స్ మీకే.**

1: బరువైన కెమేరాలు విమానాల్లో తీసుకెళ్లడానికి నిబంధనలు ఉంటాయి. దుస్తులంత తేలికైన కెమేరాలు కూడా అందుబాటులో ఉన్నాయి. వెంట తీసుకెళ్లడానికి ఇబ్బందిలేని పాకెట్ కెమెరాలు ఉత్తమం. ముందుగా మీరు వెళ్లబోయే చోటు ఎలాంటిదో తెలుసుకోండి.

2: సూర్యాస్తమయానికి ముందే నిద్రలేవాలి. అప్పుడే ఉషోదయ వేళలో ఉండే ప్రకృతి అద్భుత సౌందర్యాన్ని కెమేరాలో బంధించవచ్చు. అలాగే సూర్యాస్తమ సమయమూ అత్యద్భుతంగా ఉంటుంది.

3: ప్రయాణంలో కెమేరా ఫీచర్స్ గురించి తెలుసుకుంటూ వెళితే, సరైన ఫొటో మీకు లభించదు. బయల్దేరకముందే కెమరా, లెన్స్, ఫ్లాష్.. వంటివి ఇంటి వద్దే చూసి, నేర్చుకోవాలి.

4: దేవాలయాలు, ఆర్ట్ గ్యాలరీలు, నృత్యం, సంగీతం.. వంటివి ఫొటోలలో బంధించేముందు వాటికి సంబంధించిన కొన్ని పుస్తకాలను చదవడం వల్ల మరింత పరిజ్ఞానం లభిస్తుంది. దీని వల్ల ఒక క్రమ పద్ధతిలో కళాత్మకంగా ఫొటోలు తీసే నేర్పు అలవడుతుంది.

5: టూర్ అన్నాం కదా అని అన్నీ వేగంగా చూసేస్తే సరిపోతుంది అనుకోకూడదు. దారిలో ఎంతో మంది వ్యక్తులు ఉంటారు. ఆ ప్రాంత ప్రత్యేకత ఫొటోల ద్వారా తెలియజేయాలను కుంటే స్థానికులతో మాట్లాడితే సరైన సమాధానం లభిస్తుంది.

## ట్రావెలింగ్‌తో ఆనందం మస్త్..
## ఆరోగ్యం జబర్దస్త్!

ట్రావెలింగ్ అంటే ఇష్టమా? అయితే, తప్పకుండా ఈ విషయాలు తెలుసుకోవల్సిందే. ట్రావెలింగ్ వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలు ఇక్కడ అందిస్తున్నాం. అవేంటో చూడండి. ప్రపంచంలో అందాలకు కొదవలేదు. కొండలు, కోనలు, పచ్చని అడవులు, ఏరులు, సెలయేళ్లు, జలపాతాలు.. ఒకటేమిటీ ఎన్నో అందాలను కళ్లారా ఆశ్వాదిస్తే ఆ కిక్కే వేరు. అందుకే, చాలామంది నిత్యం ఆనంద ప్రపంచంలో విహరిస్తుంటారు. అంతేకాదు, బోలెండంత ఆరోగ్యాన్ని కూడా సొంతం చేసుకుంటున్నారు. అదెలాగో చూడండి.

**రోగ నిరోధక శక్తి పెరుగుతుంది:**

సరికొత్త ప్రాంతాలు, వాతావరణంలో విహారం వల్ల శరీరంలోని దృఢమైన యాంటిబయోటిక్స్ ఏర్పడతాయి. దీనివల్ల రోగ నిరోధక శక్తి పెరుగుతుంది.

**ఒత్తిడిని తగ్గిస్తుంది:**

ట్రావెలింగ్ వల్ల ఒత్తిడి తగ్గుతుంది. మీలో సంతోషాన్ని పెంచి, డిప్రెషన్ నుంచి గట్టెక్కిస్తుంది. మీరు ఇంటికి తిరిగి వచ్చినా సరే ఆ ఉత్సాహం కొనసాగుతోంది.

**మెదడుకు మంచిది:**

ట్రావెలింగ్ మనసుకు ఉల్లాసం కలిగిస్తుంది. కొత్త వ్యక్తులు, కొత్త



అనుభవాలతో సరికొత్త అనుభూతి ఇస్తుంది. దీనివల్ల మెదడు చురుగ్గా పనిచేస్తుంది. ట్రావెలింగ్ చేసేవారిలో క్రియేటివ్ ఆలోచనలు పెంపొందుతాయని పలు సర్వేలు పేర్కొన్నాయి.

**గుండె జబ్బుల ముప్పు ఉండదు:**

ట్రావెలింగ్ వల్ల గుండె జబ్బుల ముప్పు తగ్గుతుంది. ట్రావెలింగ్ వల్ల ఒత్తిడి, ఉద్వేగం తగ్గుతుంది. ట్రావెలింగ్ చేయనివారితో పోల్చితే ఏడాదికి కనీసం ఒకసారైనా ట్రావెలింగ్ చేసే స్త్రీ, పురుషుల్లో గుండె జబ్బులు ఏర్పడే పరిస్థితి తక్కువగా ఉన్నట్లు ఫ్రామింగ్‌హమ్ హార్ట్ స్టడీ పేర్కొంది.

**ఫిట్‌గా ఉంచుతుంది:**

ఫిట్‌గా ఉంటేనే ట్రావెల్ చేయాలి అనుకుంటే పొరపాటే. ట్రావెలింగ్ ద్వారా కూడా ఫిటనెస్ పొందవచ్చు. కొత్త ప్రాంతాలను చూస్తూ ఎంత దూరం నడుస్తున్నామో తెలీదు. దీనివల్ల మీకు తెలియకుండానే ఫిట్‌నెస్ పొందుతారు.

**ఆరోగ్యం ప్రయాణం:**

పచ్చని కొండలు, అడవుల్లో విహరించడం, జలపాతాల్లో స్నానం చేయడం వల్ల కూడా ఆరోగ్యం పెంపొందుతుంది. పచ్చని ప్రాంతాల్లో కాలుష్యం చాలా తక్కువ. ఔషద గుణాలు కలిగిన మొక్కలు నుంచి వీచే గాలి, వాటి మీదుగా ప్రవహించే జలాలు శరీరానికి మేలు చేస్తాయి. హాట్ స్ప్రింగ్స్‌లో స్నానం చేయడం కూడా ఆరోగ్యానికి మంచిదే.

**ఆయుష్షు పెంచుతుంది:**

ట్రావెలింగ్ మీ ఆయుష్షు పెంచుతుంది. ట్రావెలింగ్ వల్ల శరీరానికి అన్నిరకాల వ్యాయామం లభిస్తుంది. కాబట్టి, ఏడాదికి ఒక్కసారైనా మీకు నచ్చిన ప్రాంతంలో హాయిగా విహరించి రండి. ఆయుష్షు పెంపొందించుకోండి.



# పెద్ది నుంచి త్వరలో లవ్ సాంగ్

## దర్శకుడు బుచ్చిబాబు సానా

రామ్‌చరణ్ హీరోగా జాన్వీ కపూర్ కథానాయికగా 'ఉప్పెన' ఫేమ్ బుచ్చిబాబు సానా కాంబోలో తెరకెక్కుతున్న చిత్రం 'పెద్ది' . ఇప్పటికే విడుదలైన గ్లింప్స్ సిక్సర్ కొట్టి అభిమానుల్లో విపరీతమైన క్రేజ్ పెంచేసింది. ఆస్కార్ విజేత ఏఆర్ రెహమాన్ సంగీతం అందిస్తుండటంతో ఆ క్రేజ్ మరింత రెట్టింపు అయింది. దసరాకు వస్తుందనుకున్న ఫస్ట్ సింగిల్ రాకపోవడంతో ఫ్యాన్స్ కాస్త నిరాశ చెందారు. అయితే దర్శకుడు బుచ్చిబాబు దీపావళికి దద్దరిలే అప్‌డేట్ ఇచ్చారు. తాజాగా జరిగిన ఓ కార్యక్రమంలో తాజా అప్‌డేట్ ఇచ్చారు దర్శకుడు సానా బుచ్చిబాబు. ఆ కార్యక్రమంలో 'పెద్ది' విశేషాలేంటని యాంకర్ ప్రశ్నించగా త్వరలో మంచి లవ్ సాంగ్ ప్రేక్షకుల ముందుకురాబోతుందని. ఆ పాటకు సంగీత దర్శకుడు ఏ.ఆర్ రెహమాన్ అదిరిపోయేలా మ్యూజిక్ ఇచ్చారని ఆయన చెప్పారు. ఆ అప్‌డేట్ ఫ్యాన్స్‌లో ఉత్సాహం నింపింది. అయితే ఈ పాట దీపావళికే వస్తుందని ఆడియన్స్ ఎక్స్‌పెక్ట్ చేస్తున్నారు. దర్శకుడు దానిపై క్లారిటీ ఇవ్వలేదు. స్పోర్ట్స్ బ్యాక్‌డ్రాప్‌లో సాగే మాస్, యాక్షన్ ఎంటర్‌టైనర్ ఇది. 'ఉప్పెన' బ్లాక్‌బస్టర్ తర్వాత బుచ్చిబాబు నుంచి వస్తున్న సినిమా కావడంతో ఈ సినిమాపై భారీ అంచనాలున్నాయి.




# వరుస సినిమాలతో అనుపమ దూకుడు

మలయాళ ముద్దుగుమ్మ అనుపమా పరమేశ్వర్ ఒక్కసారిగా తన జోరు పెంచింది. గత రెండు మూడేళ్ళుగా సెట్స్ మీద ఉన్న ఆమె సినిమాలన్నీ వరుస పెట్టి విడుదల కావడం మొదలైంది. దాంతో ఈ యేడాది అనుపమా పరమేశ్వరన్ నటించిన సినిమా మొత్తం ఆరు జనం ముందుకు వచ్చినట్టయ్యింది. విశేషం ఏమంటే ఈ ముద్దుగమ్మ నటించిన నాలుగు చిత్రాలు ఇప్పటికే ఈ యేడాది విడుదల కాగా, గురువారం ఓ మలయాళ చిత్రం, శుక్రవారం తమిళ చిత్రం జనం ముందుకు వస్తున్నాయి. ఈ యేడాది ప్రారంభంలోనే ప్రదీప్ రంగనాథన్ సరసన అనుపమా పరమేశ్వరన్ నటించిన 'డ్రాగన్' మూవీ విడుదలైంది. ఇది తెలుగులోనూ వచ్చింది. ఆ తర్వాత అనుపమా పరమేశ్వరన్ నటించిన మలయాళ చిత్రం 'జానకి వి వర్సెస్ స్టేట్ ఆఫ్ కేరళ' సినిమా వచ్చింది. అనుపమా ఎంతో ఇష్టంగా చేసిన సినిమా 'పరదా'. తెలుగులో 'సినిమా బండి, శుభం' చిత్రాలను తెరకెక్కించిన ప్రవీణ్ కాడ్రేగుల ఈ సినిమాను రూపొందించాడు. విడుదలకు ముందు ఎంతో బజ్ క్రియేట్ చేసిన ఈ సినిమా ఆ తర్వాత పెద్దంత ప్రభావాన్ని చూపించలేక పోయింది. ఈ సినిమా ప్రమోషన్స్ లో అనుపమా పరమేశ్వరన్ భావోద్వేగానికి గురి కావడంతో అప్పట్లో సోషల్ మీడియాలో ఆమె గురించి విశేష ప్రచారం జరిగింది. ఇక ఈ యేడాది వచ్చిన అనుపమా పరమేశ్వరన్ నాలుగో చిత్రం 'కిష్కింధపురి' . బెల్లంకొండ సాయి శ్రీనివాస్ తో గతంలో 'రాక్షసుడు' మూవీలో నటించిన అనుపమా పరమేశ్వరన్. మరోసారి వీరిద్దరి కాంబోలో వచ్చిన 'కిష్కింధపురి' థియేట్రికల్ గా ఆశించిన స్థాయిలో కలెక్షన్స్ రాబట్టలేకపోయినా... ఓటీటీలో మంచి స్పందనే దీనికి లభించింది. తాజాగా దీపావళి కానుకగా అనుపమా పరమేశ్వరన్ నటించిన 'ది పెట్ డిటెక్టివ్' అనే మలయాళ చిత్రం గురువారం జనం ముందుకు వచ్చింది. నిజానికి ఇది గత యేడాది విడుదల కావాల్సిన సినిమా. రకరకాల కారణాలతో వాయిదా పడి ఎట్టకేలకు విడుదలైంది. ఇక శుక్రవారం ఆమె నటించిన తమిళ చిత్రం 'బైసన్' విడుదల కాబోతోంది. మారి సెల్వరాజ్ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో సీనియర్ హీరో విక్రమ్ తనయుడు ధృవ్ హీరోగా నటించాడు. కబడ్డీ నేపథ్యంలో ఈ సినిమా రూపుదిద్దుకుంది. 'బైసన్' తెలుగు వర్షన్ ఓ వారం తర్వాత 24న విడుదల కాబోతోంది. గతంలో మారి సెల్వరాజ్ తెరకెక్కించిన 'పరియేరుమ్ పెరుమాళ్'లో తనకు నటించే అవకాశం వచ్చిందని, కానీ అప్పుడు దాన్ని ఉపయోగించుకోలేక పోయానని, ఇప్పుడు మరోసారి ఆయన మూవీ 'బైసన్'లో ఛాన్స్ దక్కడం ఆనందాన్ని కలిగించిందని అనుపమా చెబుతోంది. మరి ఈ రెండు సినిమాల్లో ఏదైనా ఆమెకు మెమొరబుల్ హిట్ ను అందిస్తుందేమో చూడాలి.



# 31న వస్తున్న మాస్ జాతర

మాస్ మహారాజా రవితేజ కు సాలీడ్ హిట్ పడి చాలా కాలమే అయ్యింది. చిరంజీవితో కలిసి రవితేజ నటించిన 'వాల్తేరు వీరయ్య' తర్వాత మళ్ళీ ఆ స్థాయి సక్సెస్ ను రవితేజ చూడలేదు. అయితే బ్యాక్ టు బ్యాక్ సినిమాలు మాత్రం రవితేజ చేసేస్తున్నాడు. అక్టోబర్ 31న రవితేజ 75వ చిత్రం 'మాస్ జాతర' జనం ముందుకు రాబోతోంది. 'ధమాకా'తర్వాత శ్రీలీల మరోసారి ఈ సినిమాలో రవితేజతో జోడీ కట్టింది. ఇప్పటికే విడుదలైన ఈ సినిమా పాటలు బాగానే అలరిస్తున్నాయి. నాగవంశీ, సాయి సౌజన్య సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ సినిమాతో రచయిత భాను భోగవరపు దర్శకుడిగా పరిచయం అవుతున్నాడు. ఇది యాక్షన్ ఎంటర్ టైనర్ జానర్ కు చెందిన సినిమా. ప్రస్తుతం రవితేజ నటిస్తున్న 76వ చిత్రానికి కూడా ఒకప్పటి రచయిత కిశోర్ తిరుమల దర్శకత్వం వహిస్తున్నాడు. 'నేను శైలగ, ఉన్నది ఒకటే జిందగీ, రెడ్' వంటి రొమాంటిక్, యాక్షన్ మూవీస్ ను తీసిన అనుభవం కిశోర్ తిరుమలకు ఉంది. పైగా అతనిది మంచి పెన్. రవితేజ సరసన ఈ సినిమా ఆషికా రంగనాథ్, కేతిక శర్మ హీరోయిన్లుగా నటిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ స్పెయిన్ లో జరుగుతోంది. సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్న ఈ సినిమాకు మొదట్లో 'అనార్కలి' అనే టైటిల్ అనుకున్నారు. కానీ ఇప్పుడీ సినిమాకు 'భర్త మహాశయులకు విజ్ఞప్తి' అనే పేరు పెట్టబోతున్నారనే ప్రచారం జోరుగా సాగుతోంది. రాబోయే సంక్రాంతి బరిలో ఈ సినిమా కూడా నిలుస్తుందని అంటున్నారు. ఇది ఫ్యామిలీ డ్రామా. ఇక రవితేజ చేయబోతున్న 77వ చిత్రాన్ని శివ నిర్వాణ డైరెక్ట్ చేయబోతున్నాడని తెలుస్తోంది. 'నిన్ను కోరి, మజిలి, టక్ జగదీశ్, ఖుషీ' సినిమాలను తెరకెక్కించిన శివ నిర్వాణ ఈసారి థ్రిల్లర్ డ్రామాను తీయబోతున్నాడట. మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ దీనిని ప్రొడ్యూస్ చేస్తుందని తెలుస్తోంది. ఇందులో రవితేజ తన వయసుకు తగ్గ పాత్ర చేస్తాడని అంటున్నారు. ఇక రవితేజ చేయబోతున్న 78వ సినిమాను కళ్యాణ్ శంకర్ డైరెక్ట్ చేస్తాడని సమాచారం. 'మ్యాడ్, మ్యాడ్ స్క్వేర్' చిత్రాలను డైరెక్ట్ చేసిన కళ్యాణ్ శంకర్ నిజానికి 'టిల్లూ క్యూబ్' కు డైరెక్ట్ చేయాల్సి ఉంది. సూర్యదేవర నాగవంశీ ఈ సినిమాను నిర్మిస్తానని చెప్పారు. అయితే ఇప్పుడు కళ్యాణ్ శంకర్... ఆ సినిమాను పక్కన పెట్టి రవితేజతో ఓ సూపర్ హీరో మూవీ చేస్తాడని సమాచారం. సో... 'మాస్ జాతర' తర్వాత నాగవంశీ... రవితేజతో తీయబోయే సినిమా ఇది. ఇలా... వరుసగా నాలుగు డిఫరెంట్ జానర్స్ తో రవితేజ సినిమాలు చేస్తున్నాడు. మరి ఈ చిత్రాలలో ఏవేవి రవితేజను తిరిగి సక్సెస్ ట్రాక్ లోకి తీసుకొస్తాయో చూడాలి.




# వెట్రిమారన్ తెలుగు సామ్రాజ్యం

## ఎన్టీఆర్ వాయిస్‌తో ప్రోమో విడుదల

తమిళ దర్శకులలో వెట్రిమారన్ ది ఓ ప్రత్యేక శైలి. బడుగు, బలహీన వర్గాల పక్షాన నిలిచి, వారి సమస్యలను తెరకెక్కించడంలో వెట్రిమారన్ దిట్ట. అంతేకాదు... వేరే దర్శకులతోనూ ఇలాంటి కథలనే సినిమాలుగా నిర్మించిన వ్యక్తి వెట్రిమారన్. తెలుగులోని స్టార్ దర్శకులతో సినిమాలు చేయాలని ఆయన కొంతకాలంగా అనుకుంటున్నారు. కానీ ఏ ప్రాజెక్ట్ కూడా సెట్ కావడం లేదు. ఎన్టీఆర్ తోనూ వెట్రిమారన్ సినిమా చేస్తే బాగుంటుందని భావిస్తున్న అభిమానులు చాలా మందే ఉన్నారు. ఆ మధ్య సూర్య హీరోగా వెట్రిమారన్ ఓ సినిమా చేస్తాడని వార్తలు వచ్చాయి. కానీ ఆ మూవీ అనివార్య కారణాలతో ఆగిపోవడంతో ఇప్పుడు శింబుతో 'అరసన్' మూవీని చేస్తున్నాడు వెట్రిమారన్. ఈ సినిమా తెలుగు వర్షన్ కు ఎన్టీఆర్ సైతం తన గొంతుతో చేయూతనివ్వబోతున్నాడు. శిలంబరసన్, వెట్రిమారన్ కాంబోలో తెరకెక్కుతున్న 'అరసన్'ను తెలుగులో 'సామ్రాజ్యం' పేరుతో డబ్ చేస్తున్నారు. దీని ప్రోమో శుక్రవారం ఉదయం ఎన్టీఆర్ వాయిస్ ఓవర్ తో రాబోతోంది. ఈ మధ్య ఎన్టీఆర్ 'కింగ్ డమ్' మూవీకి వాయిస్ ఓవర్ అందించాడు. ఆ సినిమాను హిందీలో 'సామ్రాజ్య' పేరుతో డబ్ చేశారు.

ఇప్పుడు 'అరసన్' మూవీని తెలుగులో 'సామ్రాజ్యం'గా డబ్ చేయడం, దాని ప్రోమోకు ఎన్టీఆర్ వాయిస్ ఓవర్ ఇవ్వడం విశేషం. మొత్తానికి 'సామ్రాజ్యం' అనే టైటిల్ కు ఎన్టీఆర్ కు ఏదో అవినాభావ సంబంధం ఉన్నట్టుగా అనిపిస్తోంది. ఈ సినిమాను సీనియర్ నిర్మాత థాను ప్రొడ్యూస్ చేస్తున్నారు. ఇదిలా ఉంటే ఎన్టీఆర్ కు, హీరో శింబుకు మధ్య కూడా మంచి అనుబంధం ఉంది. బేసికల్ గా మంచి సింగర్ అయిన శింబు తెలుగు సినిమాల్లో కొన్ని పాటలు పాడాడు. అందులో ఎన్టీఆర్ 'బాద్ షా' మూవీ కూడా ఒకటి. ఇటు దర్శకుడు, అటు కథానాయకుడు ఇద్దరితో ఉన్న అనుబంధం కారణంగా 'సామ్రాజ్యం' ప్రోమోకు ఎన్టీఆర్ వాయిస్ ఓవర్ ఇచ్చాడని అంటున్నారు.

# కాంతారా చాప్టర్1కు దీపావళి వెలుగులు

హిట్ మూవీ 'కాంతార'కు ప్రీక్వెల్‌గా తెరకెక్కి ఆ చిత్రానికి మించిన విజయం అందుకుంది 'కాంతార చాప్టర్ అక్టోబరు 2న బాక్సాఫీసు ముందుకొచ్చిన ఈ సినిమా 12 రోజుల్లో రూ.675 కోట్లకుపైగా కలెక్షన్లు రాబట్టింది. దీపావళిని పురస్కరించుకుని కొత్త ట్రైలర్ను చిత్ర బృందం గురువారం విడుదల చేసింది. సినిమాలోని పలు కీలక సన్నివేశాలతో రూపొందించిన ట్రైలర్ ఆద్యంతం ఆసక్తిగా సాగింది. స్వీయ దర్శకత్వంలో రిషబ్‌శెట్టి హీరోగా నటించిన సంగతి తెలిసిందే.




PUBLISHED BY G.KALPANA AND PRINTED AT YAGNA PRINTERS AND PUBLICATIONS, H.NO 18-105/4, OPP HANUMANPET, MALKAJGIRI(M)MEDCHAL- 500047, MEDCHAL MALKAJGIRI DISTRICT,TELANGANA PUBLISHED FROM H.NO02-66/254,MALLAREDDY NAGAR PHASE 1, GAJULARAMARAM, QUTHBULLAPUR, MEDCHAL-500055, DISTRICT MALKAJGIRI ,TELANGANA, EDITOR : G.DAYAKAR REDDY , RNI :TELTEL/2022/83927, PHONE NUMBER 9908293393,040- 45046154